

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 29-06-2025 | సంపుటి - 24 | సంచిక - 56 | రూ : 4 | పేజీలు: 8


## ఇరాన్‌పై.. మళ్లీ బాంబులేస్తా

- నీచమైన చావు చావకుండా ఖమేనీని రక్షించా
- అయినా ఆయన ధన్యవాదాలు చెప్పలేదు
- డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం

**జూన్ 28, వాషింగ్టన్:** ఇజ్రాయెల్‌తో జరిగిన 12 రోజుల యుద్ధంలో తమదే విజయం అంటూ ఇటీవల ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ చేసిన వ్యాఖ్యలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా మండిపడ్డారు. విద్వేషంతో చేసిన ఖమేనీ ప్రకటన చూసిన తర్వాత ఆ దేశంపై విధించిన ఆర్థిక ఆంక్షలు సడలించాలన్న ఆలోచనను విరమించుకున్నానని చెప్పారు. ఇరాన్ తన అణుకార్యక్రమాన్ని తిరిగి ప్రారంభిస్తే మళ్లీ ఆ దేశంపై బాంబులు వేయడానికి తాను

తరువాయి 2లో





## కంచ గచ్చిబౌలిలో ఐటీ టవర్లు నిర్మిస్తాం..

- అభివృద్ధిని విపక్షాలు అడ్డుకుంటున్నాయి
- కాంగ్రెస్ వల్లే హైదరాబాద్‌కు ప్రపంచ ఖ్యాతి
- పీజేఆర్ ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి


**జూన్ 28 :** ప్రతిపక్షాలు అవాస్తవా లను ప్రచారం చేస్తూ హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్నాయంటూ సీఎం రేవంత్‌రెడ్డి భారాస, భాజపాలపై విమర్శలు గుప్పించారు. గతంలో కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడితే, తమ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లి కాపాడిందన్నారు. విదేశాల్లో తిరిగి, పెట్టుబడుల కోసం కంపెనీలను ఒప్పించి, కంచ గచ్చిబౌలిలో ఐటీ టవర్ల నిర్మాణం మొదలుపెడితే.. ఆ పనులనూ ప్రతిపక్షాలు అడ్డుకున్నాయన్నారు. వీటన్నింటినీ ఎదుర్కొని ఐటీ టవర్ల నిర్మాణంతో 2 లక్షల మందికి

తరువాయి 2లో

## భవిష్యత్తులో తిరుమలకు వచ్చే భక్తులందరికీ.. బీమా!

- సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్న తితిదే

**జూన్ 28 :** తిరుమలకు వచ్చే భక్తులందరికీ భవిష్యత్తులో బీమా సదుపాయం కల్పించాలని తితిదే ఉన్నతాధికారి పరిశీలిస్తున్నట్లు సమాచారం. శ్రీవారి దర్శనార్థం రోజూ సుమారు 70వేల నుంచి లక్ష మంది వరకు భక్తులు వస్తుంటారు. 2 ఘాట్‌రోడ్లు, అలిపిరి, శ్రీవారి మెట్టుమార్గం, క్యూలైన్లు తదితర ప్రదేశాల్లో అప్పుడప్పుడు ప్రమాదాలకు గురికావడం, ఆకస్మికంగా అనారోగ్యం బారిన పడడం, నడక మార్గంలో అడవి జంతువుల దాడి లాంటి ఘటనల నేపథ్యంలో భక్తులకు బీమా కల్పించాలని యోచిస్తున్నారు. ప్రమాదాలు, ఆకస్మిక గుండెపోటు, జంతువుల దాడిలో మృతిచెందిన వారికి బీమాతో చేయూతనందించాలని చూస్తున్నారు. ప్రస్తుతానికి తిరుమలలో ప్రమాదం బారిన పడి మృతిచెందిన వారికి తితిదే రూ.3లక్షల వరకు చెల్లిస్తోంది.







## మీ రోదసి యాత్ర.. నవశకానికి నాంది

- ఐఎస్ఎస్‌లో ఉన్న శుభాంశు శుక్లాతో ముచ్చటించిన మోదీ
- అంతరిక్షం నుంచి భారత్ భవ్యంగా కనిపిస్తోందన్న వ్యోమగామి

దిల్లీ: భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్).. 'భారత్ మాతా కీ జై' నినాదాలతో మార్మోగింది. 41 ఏళ్ల విరామం తర్వాత రోదసిలోకి వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లాతో వీడియో లింక్ ద్వారా ప్రధాని మోదీ సంభాషించినప్పుడు ఈ అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. శుక్లా మిషన్‌తో భారత స్వీయ మానవసహిత యాత్ర గగన్‌యాన్ దిశగా తొలి అడుగుపడిందని మోదీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. శుక్లా మాట్లాడుతూ... ''అంతరిక్ష కేంద్రం భూమిని రోజుకు 16 సార్లు చుడు తోంది. నిత్యం 16 సూర్యోదయాలు, సూర్యాస్తమయాలను వీక్షించే అవకాశం నాకు కలిగింది. ఇప్పుడు గంటకు 28 వేల కిలోమీటర్ల వేగంతో పయనిస్తున్నాం. మన దేశం పురోగమిస్తున్న వేగానికి ఇది అద్దం పడుతోంది. అంతరిక్షం నుంచి భారత్‌ను మొదటిసారి చూసినప్పుడు

తరువాయి 2లో

## కమల దళపతి ఎవరో..?

- ప్ర ధాన రేసులో ఈటల, కె.లక్ష్మణ్
- పోటీలో రామచందర్‌రావు, అర్వింద్ సైతం
- నేడు నోటిఫికేషన్.. 30న నామినేషన్.. 1న ప్రకటన

హైదరాబాద్: తెలంగాణ భాజపా అధ్యక్ష పగ్గాలు ఎవరికి దక్కుతాయన్న ఉత్కంఠకు ఆదివారం సాయంత్రం లేదా సోమవారం తెరపడనుంది. నాయకత్వ పగ్గాలు ఎవరికి అప్పగించాలన్న విషయంపై భాజపా అగ్రనేతల

తరువాయి 2లో



## 'సింగరేణి' ప్రమాద బీమా పథకం దేశానికి ఆదర్శం

2లో



## అందరికంటే అత్యుత్తమంగా ఉచిత బస్సు ప్రయాణం..

- ఆర్థికంగా భారమైనా.. మహిళల కోసం ఆగస్టు 15 నుంచి అమలు
- ఇకపై ఆర్టీసీలో అన్నీ విద్యుత్ బస్సులే తీసుకోవాలి
- సమీక్షలో సీఎం చంద్రబాబు

**జూన్ 28, అమరావతి :** 'ప్రస్తుతం దిల్లీ, పంజాబ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాయి. అన్నీ వేర్వేరు విధానాలను పాటిస్తున్నాయి. మన విధానం అత్యుత్తమంగా, సంతృప్తి కలిగేలా ఉండాలి' అని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా ప్రజలకిచ్చిన హామీ నిలబెట్టుకోవాలని, అందుకే ఆగస్టు 15 నుంచి ఈ పథకం అమలుచేస్తామని సీఎం తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై.. సీఎం చంద్రబాబు శనివారం క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ పథకం వల్ల పెరిగే ప్రయాణికుల సంఖ్యకు తగినట్లు బస్సుల సంఖ్య పెంచాలని ఆదేశించారు. కొత్త బస్సులు కొనాలని, అవసరమైతే అద్దెకు తీసుకోవాలని సూచించారు. ఇకపై తీసుకునే

తరువాయి 2లో

## ఇరాన్‌పై..మళ్లీ బాంబులేస్తా

(మొదటి పేజీ తరువాయి)

వెనుకాడబోనని హెచ్చరించారు. ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ఖమేనీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోస్టు పెట్టారు. ''యుద్ధంతో నాశమైన దేశానికి సుప్రీం నేతైన ఖమేనీ, ఇజ్రాయెల్‌పై నెగ్గానని మూర్ఖంగా చెబుతున్నారు. అది అబద్ధమని ఆయనకూ తెలుసు. ఆ దేశం నాశనమైపోయింది. మూడు రాక్షస అణుకేంద్రాలు తుడిచిపెట్టుకుపోయాయి. యుద్ధ సమయంలో ఖమేనీ ఎక్కడ దాక్కున్నాడో నాకు తెలుసు. ఇజ్రాయెల్, అమెరికా సైనిక దళాలు ఆయన్ను హతమార్చకుండా అడ్డుకున్నా. నీచమైన చావు చావకుండా రక్షించా. అయినా ఖమేనీ నాకు ధన్యవాదాలు చెప్పలేదు. ఇరాన్‌ను ఆఖరిదెబ్బ తీయడానికి టెహ్రాన్ వైపు భారీస్థాయిలో వెళుతున్న యుద్ధవిమానాలను వెనక్కి మళ్లించాలని ఇజ్రాయెల్‌ను డిమాండ్ చేశా. ఆ దాడి జరిగితే వేల మంది ఇరానియన్లు చనిపోయేవారు. గత కొన్ని రోజుల నుంచి ఆ దేశంపై ఆంక్షలు సడలించాలని ఆలోచిస్తున్నా. కానీ ఖమేనీ కోపంతో, విద్వేషంతో చేసిన ప్రకటన చూసిన తర్వాత ఆ ఆలోచనలు విరమించుకున్నా'' అని ట్రంప్ పేర్కొన్నారు.

*** అమెరికా అధ్యక్ష పదవి ప్రమాదకరం: ట్రంప్**

అమెరికా అధ్యక్ష పదవి ప్రమాదకరమైనదని అధ్యక్షుడు ట్రంప్ అభిప్రాయపడ్డారు. తనకు అప్పుడప్పుడు అధ్యక్ష పదవిపట్ల బాధాకరమైన అనుభూతి కలుగుతుందని చెప్పారు. శ్వేతసౌధంలో ఆయన మీడియా సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఉదాహరణకు మీరు కార్ రేసింగ్ డ్రైవర్లు అనుకుందాం. అక్కడ 100 మందిలో ఒకరు మరణించే అవకాశం ఉంది. అంటే ఒక శాతం మంది చనిపోయే ఛాన్స్ ఉంది. బుల్ రైడర్లూ అంతే. కారు రేసింగ్, బుల్ రైడింగ్‌లాగే అమెరికా అధ్యక్షుడికి చావు ఎప్పుడు ఎదురవుతుందో చెప్పలేం. అధ్యక్షుడిగా ఉన్నప్పుడు 5 శాతం మరణించే అవకాశాలున్నాయి. ఈ విషయం నాకు ఎవరైనా ముందే చెప్పి ఉంటే అధ్యక్ష రేసులో ఉండేవాడిని కాదు'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

## దేశ చరిత్రను వక్రీకరించారు


(మొదటి పేజీ తరువాయి)

పాలనకు ముందు భారత్ అన్నింట్లో అగ్రస్థానంలో ఉండేది. యువత తలచుకుంటే మళ్లీ ఆ స్థాయికి చేరుకోవడానికి ఎక్కువ సమయం పట్టదు. నూతన విద్యావిధానంతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. ఇందులో రాజకీయానికి ఆస్కారం లేదు. ఆంధ్రా విశ్వవిద్యాలయంలో చదువుతున్న సమయంలో ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించగా... సుమారు 17 నెలల పాటు జైలులో ఉన్నాను. ఎమర్జెన్సీలో ఎదురైన పరిస్థితులపై పాఠ్యాంశం తీసుకురావాల్సిన అవసరం ఉంది' అన్నారు. కార్యక్రమంలో మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్, ఓయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అధ్యక్షుడు ప్రొఫెసర్ వై.పార్థసారథి, కేంద్ర సాహిత్య అకాడమీ (తెలుగు) కన్వీనర్ ప్రొఫెసర్ సి.మృణాళిని, దూరదర్శన్ ప్రయోక్త ఓలేటి పార్వతీశం, ఆకాశవాణి విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్ సీవీఎస్ రాంబాబు, మిసిమి పత్రిక సంపాదకుడు వి.అశ్వినికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఇంటర్‌లో తప్పి.. ఐపీఎస్‌గా ఎదిగి**

దిగువ మధ్యతరగతి కుటుంబం.. వ్యవసాయమే జీవనాధారం.. పదో తరగతిలో ద్వితీయ శ్రేణి విద్యార్థి. ఇంటర్‌లో ఫెయిల్. అయినా పట్టు వీడలేదు. కష్టపడి చదివి.. ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. దాంతోనే సంతృప్తి చెందక ఉద్యోగానికి రాజీనామా చేసి మరీ సివిల్స్‌కు సన్నద్ధమయ్యారు. లక్ష్యానికి అనుగుణంగా ఐపీఎస్ అధికారి అయ్యారు. ఆయనే.. ఏపీలోని అనకాపల్లి జిల్లా కోటవురుట్ల మండలం పాములవాక గ్రామానికి చెందిన కిల్లాడ సత్యనారాయణ.ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలహాబాద్ ట్రాఫిక్ విభాగంలో అదనపు డీజీపీగా పనిచేస్తున్నారు. వృత్తిరీత్యా పోలీసు అధికారి అయినా... ప్రవృత్తి సాహిత్యం. 'ఆగ్రాలో ఏఎస్పీగా మొదటి పోస్టింగ్ వచ్చింది. ఎస్పీగా నక్సల్స్ ప్రభావిత జిల్లా సోన్‌భద్రాలో, డీఐజీగా మేరట్‌లో విధులు నిర్వర్తించా. కొన్నాళ్లపాటు ఏపీలోనూ డిప్యుటేషన్‌పై పనిచేశా. ఆయా రాష్ట్రాల్లో పనిచేస్తున్నప్పుడు అనేక ప్రాంతాల్లో పర్యటించాను. ఎన్నో అంశాలు తెలుసుకున్నాను. తర్వాత వాటి గురించి వ్యాసాలు రాయడం ప్రారంభించా. అలా సాహిత్యంపై మక్కువ పెరిగింది. ఇప్పటివరకు 8 పుస్తకాలు ప్రచురించాను' అని సత్యనారాయణ 'ఈనాడు'కు తెలిపారు.

## 'సింగరేణి' ప్రమాద బీమా పథకం దేశానికి ఆదర్శం




*** ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

హైదరాబాద్: సింగరేణి కార్మికులు, ఉద్యోగుల కోసం అమలు చేస్తున్న ప్రమాద బీమా పథకం దేశానికి ఆదర్శమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రామగుండం 1 బొగ్గు గని ఏరియాలో సపోర్టుమెన్‌గా పనిచేస్తున్న పెండ్రి రంజిత్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయనకు ఎస్‌బీఐలో వేతన ఖాతా ఉంది. సింగరేణి కార్మికుల వేతన ఖాతాలకు ప్రమాద బీమా పథకం అమలు చేస్తున్నారు. దాంతో ఆయన భార్య లతకు రూ.1.20 కోట్ల బీమా పరిహారం సొమ్ము చెక్కును శనివారం ప్రజాభవన్‌లో భట్టి అందజేశారు. కార్యక్రమంలో నవీన్‌మిత్తల్ తదితరులు పాల్గొన్నారు.

**విద్యుత్ ప్రాజెక్టుల్లో వేగం పెంచాలి**

సింగరేణి సంస్థ చేపడుతున్న 800 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్, 500 మెగావాట్ల పవన, 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ (పీఎస్‌పీ)ల పనుల్లో వేగం పెంచాలని ఉప ముఖ్యమంత్రి భట్టి అధికారులను ఆదేశించారు. శనివారం ప్రజాభవన్‌లో విద్యుత్ ప్లాంట్లపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ... ''రిజర్వాయర్లలో ఏర్పాటు చేయనున్న ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లకు అనుమతుల కోసం నీటిపారుదల శాఖకు లేఖలు రాయాలి. ఐదు జిల్లాల్లో ఏర్పాటు చేయతలపెట్టిన 500 మెగావాట్ల పవన విద్యుత్తు ప్లాంట్లకు సంబంధించిన డీపీఆర్‌లను జులై నెలాఖరుకల్లా సిద్ధం చేయాలి. మేడిపల్లిలో 500 మెగావాట్ల పీఎస్‌పీ నిర్మాణాన్ని తక్షణమే చేపట్టండి. రాజస్థాన్ విద్యుత్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు 1,500 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను ఆ రాష్ట్రంలోని సోలార్ వ్యాలీలో త్వరితగతిన ఏర్పాటు చేయాలి'' అని ఆదేశించారు. తెలంగాణలో సింగరేణి నిర్మించాల్సిన 800 మెగావాట్ల థర్మల్ ప్లాంటుపైనా చర్చించారు.

# మీ రోదసి యాత్ర.. నవశకానికి నాంది

(మొదటి పేజీ తరువాయి)

భవ్యంగా కనిపించింది'' అని పేర్కొన్నారు. మోదీ, శుభాంశుల మధ్య సాగిన 18 నిమిషాల సంభాషణలోని ముఖ్యాంశాలివీ..

మోదీ: శుభాంశు..! నేడు మీరు భారత భూభాగానికి చాలా దూరంలో ఉన్నప్పటికీ.. ప్రతి భారతీయుడి హృదయానికి అత్యంత దగ్గరగా ఉన్నారు. మీ పేరులో 'శుభం' ఉంది. అందువల్ల శుభప్రదమైన నవశకానికి మీ యాత్ర నాంది పలికింది. నా గొంతులో భారతీయుల ఉత్సాహం ఉంది. అంతరిక్షంలో భారతీయ జెండాను ఎగురవేసినందుకు మీకు నా హృదయ పూర్వక అభినందనలు. అక్కడ అంతా బాగుందా? మీ ఆరోగ్యం ఎలా ఉంది?

శుభాంశు: మీ అందరి ప్రేమ, ఆశీర్వాదాలతో నేను ఇక్కడ క్షేమంగా, సురక్షితంగా ఉన్నా. ఇక్కడ చాలా బాగుంది. ఈ యాత్ర నాది మాత్రమే కాదు. దేశమంతటిదీ. ఇది నాకు పెద్ద అవకాశం. దేశానికి ప్రాతినిధ్యం వహించడం చాలా గర్వంగా ఉంది.

మోదీ: రోదసిలో మీరెన్నో పరిశోధనలు చేస్తున్నారు? రాబోయే రోజుల్లో వ్యవసాయం, ఆరోగ్యానికి మేలు చేసే ప్రయోగం ఏదైనా ఉందా?

శుభాంశు: గర్వంగా చెప్పగలను. మొదటిసారి భారతీయ శాస్త్రవేత్తలు ఏడు వినూత్న పరిశోధనలకు రూపకల్పన చేశారు. వాటిని ఐఎస్ఎస్‌కు తీసుకొచ్చా. మొదటి పరిశోధనను మూలకణాలపై చేపట్టాల్సి ఉంది. అంతరిక్షంలో గురుత్వాకర్షణ శక్తి ఉండదు. ఫలితంగా కండరాల క్షీణత చోటు చేసుకుంటుంది. ప్రత్యేక పదార్థం తీసుకోవడం ద్వారా కండరాల క్షీణతను నిలువరించటం లేదా దాన్ని జాప్యం చేయడంపై నా పరిశోధన దృష్టిపెడుతుంది. కండరాల క్షీణతతో భూమిపైన బాధపడే వృద్ధులకు ఈ ప్రత్యేక పదార్థం ఉపయోగపడుతుందేమో పరీక్షిస్తాం. రెండోది సూక్ష్మ ఆల్గే వృద్ధి ప్రయోగం. ఇక్కడ దాని వృద్ధిని చూస్తే ఆ ప్రక్రియను అనుసరిస్తే పెద్దమొత్తంలో అభివృద్ధి చేసి పోషకాలు అందించవచ్చు. ఇది ఆహార భద్రతకు కూడా ఉపకరిస్తుంది.

మోదీ: అక్కడి పరిస్థితులు ఎంత భిన్నంగా ఉన్నాయి. వాటికి ఎలా అలవాటుపడుతున్నారు?

శుభాంశు: ఇక్కడ అన్నీ భిన్నంగా ఉన్నాయి. ఏడాది శిక్షణ తీసుకున్నాను. మొత్తం వ్యవస్థలు, ప్రయోగాల గురించి మాకు తెలుసు. కానీ ఇక్కడికి రాగానే అకస్మాత్తుగా మొత్తం మారిపోయింది. భారరహితస్థితి కారణంగా ఇప్పుడు మీతో మాట్లాడుతున్నప్పుడు నా కాళ్లను కట్టుకున్నాను. లేదంటే పైకి వెళ్లిపోతాను. నీళ్లు తాగాలన్నా, నడవాలన్నా, నిద్రించాలన్నా కష్టం. సీలింగ్‌పైన, గోడలపై కూడా విశ్రమించొచ్చు. శిక్షణ బాగుంది. కానీ మారిన వాతావరణానికి అలవాటు పడడానికి ఒకటి రెండు రోజులు పడుతుంది.

మోదీ: సైన్స్, ఆధ్యాత్మికం భారత్ ప్రత్యేకతలు. స్పేస్ సెంటర్‌లో మనశ్శాంతి కోసం ధ్యానం ఏమైనా ఉపయోగపడుతోందా?

శుభాంశు: కచ్చితంగా ఉపయోగపడుతోంది. భారత్ ఇప్పటికే యోగా కార్యక్రమాలు చాలా చేస్తోంది. అంతరిక్షంలో మనశ్శాంతి ఉండదని చాలామంది అన్నారు. సాధారణ శిక్షణ తీసుకునేప్పుడు, రాకెట్ లాంచ్ సమయంలో చాలా ఒత్తిడికి గురయ్యా. ప్రతికూల పరిస్థితుల్లో ధ్యానం చాలా ఉపయోగపడుతుంది.

**అనుభవాలు నిక్షిప్తం చేసుకోండి**

''గగన్‌యాన్ మిషన్‌ను ముందుకు తీసుకెళ్లాలి. మన సొంత అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించాలి. చందమామపై భారత వ్యోమగామి దిగాలి. మీరు నేర్చుకున్న అంశాలు భవిష్యత్ యాత్రల్లో కీలక పాత్ర పోషిస్తాయి. మీ ప్రతి అనుభవాన్నీ జాగ్రత్తగా నిక్షిప్తం చేసుకుంటున్నారనుకుంటున్నా'' అని శుభాంశుకు మోదీ సూచించారు. ఒక స్పాంజీలా అన్ని అనుభవాలను ఒడిసి పడుతున్నానని శుభాంశు బదులిచ్చారు. చివర్లో మోదీ 'భారత్ మాతా కీ జై' అని నినదించగా.. శుక్లా కూడా ఆయనతో గొంతు కలిపారు.

# కంచ గచ్చిబౌలిలో ఐటీ టవర్లు నిర్మిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఉపాధి కల్పిస్తామన్నారు. గచ్చిబౌలి కూడలిలో దివంగత పి.జనార్దన్‌రెడ్డి ఫ్లైఓవర్‌ను శనివారం సీఎం ప్రారంభించారు. అనంతరం.. అక్కడ ఏర్పాటు చేసిన సభలో సీఎం ప్రసంగించారు. ''హైటెక్‌సిటీకి అప్పటి సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి శంకుస్థాపన చేసినప్పుడు పీజేఆర్ మంత్రిగా ఉన్నారు. రాజీవ్‌గాంధీ టెక్‌పార్కును మహారాష్ట్రకు తరలించేందుకు కొందరు చేసిన ప్రయత్నాలను పీజేఆర్ అడ్డుకున్నారు. పేదల అభ్యున్నతి కోసం శ్రమించిన ఆయనను ఎప్పటికీ గుర్తు పెట్టుకోవాలన్న ఉద్దేశంతో ఈ వంతెనకు పీజేఆర్ పేరు పెట్టాం. హైటెక్‌సిటీకి కాంగ్రెస్ పునాది వేస్తే.. తర్వాతి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సైబరాబాద్ పేరుతో నగరాన్ని అంతర్జాతీయస్థాయికి తీసుకెళ్లారు.

**నాగార్జున కూడా**

**అభినందించారు..**

చెరువులు, నాలాలను సంరక్షించేందుకు హైడ్రాను ఏర్పాటు చేశాం. తమ్మిడికుంటలోని సినీ నటుడు నాగార్జునకు చెందిన ఎన్‌కన్వెన్షన్ కూల్చివేతతో ఆక్రమణల తొలగింపు మొదలైంది. ఇటీవల నాగార్జున నన్ను కలిశారు. ఆయన భూమిని చెరువు సంరక్షణ కోసం ఇచ్చారు. హైడ్రా చేస్తున్న కార్యక్రమాలను ప్రశంసించారు. అంబర్‌పేటలోని ఐదెకరాల బతుకమ్మకుంటను భారాస నేతల ఆక్రమణ నుంచి విడిపించి, చెరువును పునరుద్ధరించాం. మరిన్ని చెరువులకు కూడా జీవం పోశాం.

**అమిత్‌షాను కలుస్తాం**

అభివృద్ధి పనుల కోసం ఇప్పటికి 35 సార్లు దిల్లీ వెళ్లి కేంద్ర పెద్దలను కలిశాను. ప్రాంతీయ వలయ రహదారి (ఆర్ఆర్ఆర్), మెట్రో రైలుకు, మూసీ నది అభివృద్ధికి నిధులివ్వాలని కోరినా.. కేంద్రం స్పందించట్లేదు. రాష్ట్రానికి వస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను ఆదివారం కలుసుకుంటాం. ఆయన దృష్టికి ఇవన్నీ తీసుకెళ్తాం.. నిధులు సాధించే వరకు వదిలిపెట్టం.

**100 రోజుల్లో ప్రణాళిక**

దిల్లీ నగరం కాలుష్యం కారణంగా నివాసయోగ్యత కోల్పోతోంది. ట్రాఫిక్ సమస్యతో బెంగళూరు, ముంబయి నగరాలూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. హైదరాబాద్‌లో ఆ పరిస్థితి రావొద్దు. కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. రోడ్ల విస్తరణ, పై వంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణమే లక్ష్యంగా హెచ్‌సిటీ ప్రాజెక్టు రూపొందించాం. కాలుష్యానికి కారణమవుతున్న మూడు వేల ఆర్టీసీ బస్సులను జిల్లాలకు ఇవ్వాలని, నగరంలో 100 శాతం విద్యుత్తు బస్సులు నడపాలని ఇప్పటికే మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆదేశించాం. ఆటో కార్మికులు సీఎన్‌జీ, బ్యాటరీ ఆటోలను కొనుక్కోవాలి. క్యాబ్‌లు నడిపే సంస్థలు, వ్యక్తులు కూడా విద్యుత్తు కార్లు వినియోగించడంపై దృష్టి పెట్టాలి. 100 రోజుల్లో నగరానికి బృహత్తర అభివృద్ధి ప్రణాళిక అందుబాటులోకి వస్తుంది. విమానాశ్రయం అవతల ఉన్న 30 వేల ఎకరాల్లో భారత భావి నగరాన్ని అభివృద్ధి చేస్తున్నాం. అక్కడే క్రీడల విశ్వవిద్యాలయం, ఏఐ ఆధారిత పరిశ్రమలు, ఐటీ కంపెనీలతో.. కాలుష్యరహిత నగరం రూపుదిద్దుకుంటుంది'' అని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, మేయర్ విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

# కమల దళపతి ఎవరో?

(మొదటి పేజీ తరువాయి)

కసరత్తు తుది దశకు చేరింది. అధికార కాంగ్రెస్‌ను ఎదుర్కోవడం, పార్టీని బలోపేతం చేయడం, స్థానిక సంస్థల ఎన్నికలు తదితర అంశాలను కొత్త అధ్యక్షుని ఎంపికలో పరిగణనలోకి తీసుకుంటున్నట్లు సమాచారం. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర సారథ్య బాధ్యతలపై భాజపా జాతీయ నాయకత్వం దాదాపుగా ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అధ్యక్ష పదవికి ప్రధానంగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ పేర్లు వినిపిస్తున్నాయి. మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు పేరును ఆరెస్సెస్‌తో పాటు కొందరు సీనియర్ నేతలు బలంగా ప్రతిపాదించినట్లు సమాచారం. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పేరును కూడా చురుగ్గా పరిశీలిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**కొత్త అధ్యక్షుడు ఎప్పటి వరకు?**

ప్రస్తుత అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి స్థానంలో మరో నేతకు పగ్గాలు అప్పగించనుండగా కొత్త సారథి పదవీకాలం మూడు సంవత్సరాలు ఉంటుంది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు మూడున్నర సంవత్సరాల వ్యవధి ఉంది. ప్రస్తుతం నియమించే అధ్యక్షుడినే అసెంబ్లీ ఎన్నికల వరకు కొనసాగించాలా.. ఎన్నికల ముందు మరో నాయకుడిని అధ్యక్షుడిగా తీసుకురావాలా.. అన్న విషయంపైనా భాజపా జాతీయ నాయకత్వం చర్చించినట్లు తెలిసింది. రాష్ట్ర అధ్యక్షుడి ఎంపికలో... ఈ రాజకీయ సమీకరణం కూడా ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు సారథ్య బాధ్యతలు అప్పగిస్తే అసెంబ్లీ ఎన్నికల వరకు కొనసాగించే అవకాశం ఉంటుందన్న చర్చ జరుగుతోంది. మరో నేతకు అవకాశం ఇస్తే ఎన్నికల ముందు బండి సంజయ్‌కు రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు ఇచ్చే ఆస్కారం ఉంటుందన్న అభిప్రాయాలు పార్టీ వర్గాల్లో ఉన్నాయి. ఎన్నికల అధికారిగా శోభా కరంద్లాజే

అధ్యక్ష ఎన్నికకు భాజపా శనివారం షెడ్యూల్ విడుదల చేసింది. ఆదివారం నోటిఫికేషన్ వెలువడనుంది. సోమవారం నామినేషన్లు స్వీకరిస్తారు. జులై 1న అధ్యక్షుణ్ని అధికారికంగా ప్రకటిస్తారు. ఎన్నిక ప్రక్రియను పూర్తి చేసేందుకు కేంద్ర మంత్రి, పార్టీ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి శోభా కరంద్లాజే ఆదివారం హైదరాబాద్ రానున్నారు. అధ్యక్షునిగా ఎన్నికయ్యే నేతకు ఆదివారం సాయంత్రం లేదంటే సోమవారం ఉదయం సంకేతాలు ఇవ్వనున్నట్లు తెలిసింది.

**బీసీకే అవకాశం!**

కాంగ్రెస్‌లో పీసీసీ అధ్యక్షుడు బీసీ వర్గం కావడం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఆ వర్గం నేతకే రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు ఇచ్చేందుకు అవకాశాలు అధికంగా ఉంటాయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అదే కోణంలో నిర్ణయం తీసుకుంటే ఈటల, లక్ష్మణ్, అర్వింద్‌లలో ఒకరికి ఛాన్స్ దక్కుతుంది. లక్ష్మణ్ ఇప్పటికే ఓసారి రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. నాయకుల మధ్య విభేదాల్లేకుండా సమన్వయం చేస్తారనే కోణంలో ఆయన పేరును పార్టీ ప్రముఖంగా పరిశీలిస్తోందని తెలిసింది. అయితే (తనకు ఆసక్తి లేదని ఆయన జాతీయ ముఖ్యనేతలకు చెప్పినట్లు సమాచారం. ఈ విషయాన్ని జాతీయ నాయకత్వం పరిగణనలోకి తీసుకుంటే ఈటల, అర్వింద్‌లలో ఒకరికి అవకాశం ఉంటుంది. కాంగ్రెస్‌ను ఎదుర్కోవడంతో పాటు బలమైన సామాజికవర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తే మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పేరూ తెరపైకి వచ్చే అవకాశం ఉంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేరుపై కూడా కొంతకాలం క్రితం చర్చ జరిగినట్లు తెలిసింది. కేంద్ర మంత్రిగా కొనసాగుతానని ఆయన చెప్పినట్లు సమాచారం.

# అందరికంటే అత్యుత్తమంగా ఉచిత బస్సు ప్రయాణం

(మొదటి పేజీ తరువాయి)

బస్సులన్నీ విద్యుత్‌వే ఉండాలని, ఇప్పుడున్న బస్సులనూ ఈవీలుగా మార్చేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలన్నారు.

**అన్ని మోడళ్లనూ పరిశీలించండి**

'డీజిల్, విద్యుత్, సీఎన్జీ బస్సులు, బ్యాటరీ స్వాపింగ్.. ఇలా ఏ బస్సుల కొనుగోలు, నిర్వహణకు ఎంత ఖర్చవుతుందో ప్రతిపాదనలు రూపొందించండి. బ్యాటరీతో, బ్యాటరీ లేకుండా బస్సులు, ప్రైవేటు సంస్థలు సర్వీస్ స్టేషన్లను నిర్వహించడం, బస్సులు ఆపరేట్ చేయడం.. ఇలా ఏ విధానంలో ఖర్చు తగ్గుతుందో పరిశీలించాలి. ఆర్టీసీయే విద్యుదుత్పత్తి చేసి, దానిని బస్సులకు వినియోగించగలిగితే ఎంత మేరకు నిర్వహణ వ్యయం తగ్గుతుందో అంచనా వేయండి' అని సీఎం ఆదేశించారు. 'ఆర్థిక కష్టాలు అధిగమించాలంటే ఆర్టీసీ ఆదాయ మార్గాలు పెంచుకోవాలి. ఖర్చు ఎలా తగ్గించుకోవాలి? ఇతర ఆదాయ మార్గాలేంటని దృష్టిపెట్టాలి. బస్టాండ్లలో మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచడం మొదలుకొని.. ప్రయాణం వరకు అన్నింటా ప్రయాణికుల్లో సంతృప్తి పెరిగేలా నిర్వహణ ఉండాలి' అని సీఎం పేర్కొన్నారు.

*** 88.90 కోట్లకు పెరగనున్న మహిళల ప్రయాణాలు**

'రాష్ట్రంలో 2.62 కోట్ల మంది మహిళలు ఉన్నారు. వీరిలో పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఏటా మహిళల ప్రయాణాల సంఖ్య 43.06 కోట్లుగా ఉంది. ఉచిత బస్సుప్రయాణ పథకం అమలుచేస్తే, ఇది ఏటా 75.51 కోట్లకు పెరుగుతుంది. ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో మహిళల ప్రయాణాల సంఖ్య ఏటా 6.85 కోట్లు ఉండగా, అది 13.39 కోట్లకు పెరుగుతుంది. మొత్తంగా



ఉచిత బస్సు ప్రయాణ పథకంతో మహిళలు ఏడాదిలో 88.90 కోట్లసార్లు ప్రయాణించే వీలుంది. ప్రతి మహిళ వారానికి ఒకసారైనా ప్రయాణిస్తారు' అని అధికారులు సీఎంకు వివరించారు. ఈ పథకం అమలుకు అదనంగా 2,536 బస్సులు అవసరమని అధికారులు సీఎంకు తెలిపారు. ఇందుకు రూ.996 కోట్లు అవుతుందన్నారు. బస్టాండ్లలో తాగునీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్వహణ, సమాచార బోర్డులు, ఇతర సదుపాయాలు మెరుగుపరచాలని తెలిపారు. ఈ సమీక్షలో రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు, రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే తదితరులు పాల్గొన్నారు.

*** వచ్చే వారం మరోసారి భేటీ**

ఈ పథకంపై సీఎం చంద్రబాబు వచ్చేవారం మరోసారి సమీక్ష నిర్వహించనున్నారు. ఈలోపు విద్యుత్ బస్సులు, సీఎన్‌జీ బస్సులు, బ్యాటరీ స్వాపింగ్.. తదితరాలపై అధ్యయనం చేసి నివేదికతో రావాలని సీఎం ఆదేశించారు. ఆర్టీసీలో ప్రస్తుతమున్న బస్సుల్లో 57% పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ సర్వీసులే. ఎక్స్‌ప్రెస్‌లు, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు మరో 17% ఉన్నాయి. రాష్ట్రంలో పెద్ద నగరాలు లేకపోయినా సరే.. సీఎం చంద్రబాబు లేఖ రాయడంతో కేంద్రం స్పందించి.. 11 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో 750 విద్యుత్ బస్సులను పట్టణ రవాణా కింద అందిస్తోంది.

# ప్రజా సమస్యలపై పోరాటాల ద్వారా ప్రజలను ఐక్యం చేయాలి

*** సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మతోన్మాద కార్పొరేట్ రాజకీయ విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజె రమేష్ పిలుపునిచ్చారు. స్థానిక మంచి కంటి భవన్లో కొత్తగూడెం పట్టణ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు రెండు రోజుల పాటు జరుగుతున్న సందర్భంగా మొదటి రోజు క్లాసులు ప్రారంభిస్తూ ఏజే రమేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటాల ద్వారా ప్రజలను ఐక్యం చేయాలన్నారు. మతం పేరుతో జరిగే విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలను పోరాటాల్లోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం ప్రజల దైనందిన సమస్యలు వెలుగులోకి రాకుండా ప్రజలు వాటిపై ప్రశ్నించకుండా మతం పేరుతో ప్రజలను విభజించు పాలించు అని బ్రిటిష్ విధానాన్ని అమలు చేస్తుందని విమర్శించారు. దేశ సంపదను కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతూ పేద మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. ప్రస్తుత రాజకీయాలు వ్యాపారం అయిపోయిన సందర్భంలో కుల మత రాజకీయాలు ముందుకు వస్తున్న నేపథ్యంలో స్వచ్ఛమైన రాజకీయాలు పట్ల ప్రజలకు విశ్వాసం కల్పించాలని రాజకీయాలలో విలువలు బతికే ఉన్నాయని నమ్మకం ప్రజలకు కల్పించాలన్నారు. రాజకీయాలలో విలువలకు నిలువటద్దంగా కమ్యూనిస్టు పార్టీలు ఉన్నాయి అనే విశ్వాసానికి రేకెత్తించాలని తెలియజేశారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడటం అంటే ప్రజలు మతం




వైపు వెళుతున్న పరిస్థితులపై వారి సమస్యలపై పోరాటం ద్వారా మత ఉన్మాద విధానాలను ఎండగట్టొచ్చని చెప్పారు. వర్గ పోరాటాలకు ఆటంకంగా ఉన్న మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా శ్రామిక వర్గాన్ని ఐక్యం చేయాల్సిన బాధ్యత వారిలో మతోన్మాదానికి వ్యతిరేకంగా సైద్ధాంతిక అవగాహనను పెంపొందించాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపై ఉందని గుర్తు చేశారు. మత రాజకీయాలపై ప్రజలను విభజించాలని చూస్తున్న వారికి ప్రజా సమస్యలను తీసుకొని పోరాటాల ద్వారా సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ క్లాసులకు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ ప్రిన్సిపల్ గా వ్యవహరించారు. మొదటిరోజు మతం మతోన్మాదం , సిపిఎం విశిష్టత క్లాసులను టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ బోధించారు. ఈ కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు సందకూరి లక్ష్మి, నందిపాటి రమేష్, నాయకులు జునుమాల నగేష్, ఆవుల శ్రీరాములు, ఆలేటి శ్రీను, అన్నవరపు ఇందిరా, పప్పుల ప్రమోద్, వాణి, గడల నరసింహారావు, పద్మ, రజిత, బాలకృష్ణ, రాములు, రఘు, రమ, నాగదుర్గ, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలో చదువుతున్న విద్యార్థులకు

# కుర్చీలను అందజేయడం అభినందనీయం

*** కార్పొరేటర్లు కొలుకుల జగన్, మంత్రి సత్యనారాయణలు**

*** సంస్కృతి పాఠశాల ఆధ్వర్యంలో అంగన్వాడీ పిల్లలకు కుర్చీలు అందజేత**





జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : అంగన్వాడీలో చదువుతున్న విద్యార్థు లకు కుర్చీలను అంద జేయడం అభినందనీయమని జగద్గిరిగుట్ట, సూరారం డివిజన్ల కార్పొరేటర్లు కొలుకుల జగన్, మంత్రి సత్యనారాయ ణలు అన్నారు. శనివారం జగద్గిరిగుట్ట డివిజన్ రాజీవ్ గృహ కల్ప కూన మహాలక్ష్మి నగర్ లోని సంస్కృతి పాఠశాల ఆధ్వర్యంలో అంగన్వాడి విద్యార్థులకు కుర్చీలను అందజేశారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలుకుల జగన్, మంత్రి సత్యనారాయణలు పాల్గొని స్థానికంగా ఉన్న ఆరు అంగన్వాడీ సెంటర్ లలో ఉన్న పిల్లలకు కుర్చీలను అందజేశారు అనంతరం కార్పొరేటర్ లు జగన్, సత్య నారాయణ లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇదే విధంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు చేయూతగా ఉండాలని ఆకాంక్షించారు. జగద్గిరిగుట్ట సెక్టార్ అంగన్వాడి సూపర్వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ అంగడి వాడి లకు ఆసరా నిలవడటం సంతోషకరమన్నారు. పాఠశాల యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాం డెంట్ గడ్డమీది బాలరాజు, స్థానిక నాయకులు మహంకాళి, ఎర్ర లక్ష్మయ్య, ఆంజనేయులు, ప్రభాకర్, శ్రీనివాస్, గిరి, అంగన్వాడి టీచర్లు రాధిక, జరీనా, అరుణ, విజయలక్ష్మి, తులసి తదితరులు పాల్గొన్నారు.

## అసత్య ప్రచారం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

మేడిపల్లి, (ప్రజాస్ఫూర్తి) : మేడిపల్లి ప్రెస్ క్లబ్ పై వ్యక్తులపై సోషల్ మీడియా (వాట్సాప్ )లో అసత్య ప్రచారాలు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదైన ఘటన మేడిపల్లి పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. మేడిపల్లి సీఐ ఆర్.గోవింద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మేడిపల్లి ప్రెస్ క్లబ్ అంతర్గత అంశాలపై సోషల్ మీడియా (వాట్సాప్) నెట్వర్క్ లో దుష్ప్రచారం చేస్తూ పోస్ట్ చేసిన రాజాపేట నవీన్ చారీ అనే వ్యక్తిపై బీఎన్ఎస్ 352 ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.అబద్ధాలు, అసత్య ప్రచారాలు చేస్తూ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించేలా,ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్ట్ లు పెడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని సీఐ గోవింద్ రెడ్డి తెలిపారు.

## తిరుమలలో హైదర్ నగర్ చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

*** ఆకట్టుకున్న రుహని కూచిపూడి నృత్య అకాడమీ చిన్నారులు**





శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి): తిరుమల తిరుపతి దేవస్థాన ఆస్థాన మండపంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో హైదరాబాద్ చిన్నారుల కూచిపూడి నృత్యం పలువురుని ఆకట్టుకుంది. తిరుపతిలోని హిందూ ధర్మ ప్రచార పరిషత్ సౌజన్యంతో అన్నమాచార్య ఆర్ట్స్ అకాడమీ ఆస్థాన మండపంలో చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ నృత్య ప్రదర్శనలో నగరంలోని హైదర్ నగర్ రుహని కూచిపూడి నృత్య అకాడమీ నిర్వాహకురాలు నేరెళ్ల కల్పన ఆధ్వర్యంలో చిన్నారులు నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శనలో బిందు మాధవి, భావనలతో పాటు పలువురు చిన్నారుల నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరింపజేసింది. ఈ సందర్భంగా రుహని కూచిపూడి నృత్య అకాడమీ నిర్వాహకురాలు నేరెళ్ల కల్పన మాట్లాడుతూ రుహని కూచిపూడి అకాడమీలో కూచిపూడి నృత్యంలో శిక్షణ తీసుకున్న చిన్నారులు తిరుమల తిరుపతి దేవస్థాన ఆస్థాన మండపంలో కూచిపూడి నృత్య ప్రదర్శన చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కూచిపూడి నృత్య ప్రదర్శనలో అకాడమీ చిన్నారులు అద్భుతమైన ప్రదర్శన చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారన్నారు. ఈ ప్రదర్శనలో చిన్నారుల తల్లిదండ్రులు, అకాడమీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాలానగర్ జోన్ డిసిపి కె.సురేష్ కుమార్ కు ఉత్కృష్ట సేవా పతకం



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : బాలానగర్ జోన్ డిసిపి కె.సురేష్ కుమార్ కు కేంద్ర ప్రభుత్వం చే ప్రదానం చేయబడే ఉత్కృష్ట సేవా పతకం లభించింది. గత 15 సంవత్సరాలుగా శాంతి భద్రతలు కమ్యూనిటీ పోలిసింగ్, మావోయిస్ట్ నిరోధక కార్యకలాపాలలో భాగంగా ఆయన చేసిన సేవలకు గాను గుర్తింపుగా ప్రభుత్వం ఈ అవార్డు ప్రకటించింది. ములుగు, భూపాలపల్లి, ఆసిఫాబాద్ జిల్లాలో మావోయిస్ట్ కార్యక్రమాలు నిరోధించుటలోను, ఆసిఫాబాద్ జిల్లాలో కమ్యూనిటీ పోలిసింగ్ లో భాగంగా అనేక సేవ కార్యక్రమాల ద్వారా ఆయన గుర్తింపుపొందారు. ప్రతిష్ఠాత్మక ఈ అవార్డు పొందినందుకు గాను పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది, బంధు మిత్రులు ఆయనను అభినందించారు.

## జూలై 9 న దేశవ్యాప్తంగా జరుగు సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

**ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ వెంకన్న**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసన గా జూలై 9 వ తేదీన దేశవ్యాప్తంగా జరుగు సార్వత్రిక సమ్మెను సింగరేణిలో కూడా చేయుటగాను సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ వెంకన్న,కొత్తగూడెం రీజియన్ ప్రధాన కార్యదర్శి ఎన్ సంజీవ్ కలిసి కొత్తగూడెం సింగరేణి హెడ్ ఆఫీస్ లో డైరెక్టర్ పా గౌతమ్ పోట్రు కి యూనియన్ పరంగా సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది.అనంతరం వారు ప్రసంగిస్తూ కొత్తగూడెంలో ప్రారంభం కాబోతున్న ఓసి లో మొదటిగా స్థానిక నిరుద్యోగ యువకులకే అవకాశాలు కల్పించాలని,బి రిజిస్టర్ ప్రకారం స్థానికుల్ని ఉద్యోగస్తుల్ని గుర్తించాలని,భూపాలపల్లి సెక్యూరిటీ గాడ్స్ ని యధావిధిగా కొనసాగించాలని వారు కోరారు. అలాగే సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు బోనస్ పెంచాలని, పర్మినెంట్ కార్మికులకు ప్రాఫిట్ బెనిఫిట్స్ పెంచాలని అనేక సమస్యలపై జులై 9న సమ్మె జరుగుతుందని ఈ సమ్మెకు కార్మికులంతా సన్నద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. పై విషయాలపై స్పందించిన డైరెక్టర్ పా గారు ఈ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## మంచానికి పరిమితమైన గుబ్బల సతీష్ కు ఆర్థిక సహాయం



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ప్రమాదవశాత్తు గోడ కూలి నడుము మీద పడడంతో గుబ్బల సతీష్ వెన్నుపూస దెబ్బతిని రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. కుటుంబ పోషణకు ఆటోడ్రైవర్ వృత్తిగా జీవనం సాగిస్తున్న సతీష్ గత 15 సంవత్సరాలుగా మంచానికే పరిమితమై అవస్థలు పడుతున్న దీన పరిస్థితి లో ఆర్థికంగా కుటుంబం సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.వైద్యం, మెడిసిన్స్ కొరకు వేలాది రూపాయలు ఖర్చవుతుంది.సతీష్ దీన పరిస్థితి కుటుంబ ఇబ్బందులను ఆర్థిక ఇబ్బందులను తెలుసుకున్న గండికోట కిరణ్ గుబ్బల సతీష్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించి, అతని ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకుని నేనున్నానని ధైర్యం చెబుతూ సతీష్ కు ప్రతినెల వెయ్యి రూపాయలు మెడికల్ ఖర్చులకు అందజేస్తున్నారు. ఈనేపథ్యంలో సతీష్ రెండు కాళ్లు తొలగించకుంటే ప్రాణాలకే ప్రమాదమని, హైదరాబాద్ లోని ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించిన వైద్యులు తెలిపారు. సాయం చేయటానికి మంచి మనసుతో పాటు ఆర్థిక సాయం కూడా చేసే తత్వం ఉన్న కిరణ్ వారికి అండగా నిలిచి మెడికల్ ఖర్చుల నిమిత్తం ఐదువేల రూపాయలను ఆర్థిక సహాయం చేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. అంతేకాకుండా ఆపరేషన్ తరువాత గుబ్బల సతీష్ వారి కుటుంబ బతుకుతెరువు కోసం వ్యాపారం చేసుకుంటామని తెలిపారు. ఆపదలో ఉన్న వారికి చేయూతనివ్వ ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయి ఇంతకన్నా మానవత్వం దైవత్వం మరొకటి లేదు అనే కొటేషన్లు చదువుకొని వదిలిపెట్టే వారే ఉన్న నేటి సమాజంలో అందుకు భిన్నంగా కిరణ్ కుమార్ గండికోట ఆచరణలో చేసి చూపుతున్నారు. గుబ్బల సతీష్ కుటుంబం వ్యాపారం చేసుకోవడానికి అవసరమయ్యే పెట్టుబడి పెడతానని హామీ ఇచ్చారు. దీంతో పట్టణంలోని పలువురు జర్నలిస్ట్ కిరణ్ కుమార్ గండికోట రీల్ హీరోల కంటే రియల్ హీరో అంటూ అభినందనలు తెలుపుతున్నారు.

## అశ్వాపురం పోలీస్ స్టేషన్ ను సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: అశ్వాపురం పోలీస్ స్టేషన్ ను శనివారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సందర్శించారు. మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి జిల్లా ఎస్పీ కి స్వాగతం పలికారు.అనంతరం పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తించే సిబ్బంది నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు.అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై






చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా నిత్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు.పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో సంచరిస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు,సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి,సీఐ అశోక్ రెడ్డి , సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సును బైక్ ఢీ ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : రోడ్డును క్రాస్ చేస్తున్న ఆర్టీసి బస్సును వేగంగా దూసుకవచ్చిన ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.... జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న పార్కింగ్ ప్రాంతం నుంచి శనివారం జీడిమెట్ల డిపోకు చెందిన ఆర్టీసి బస్సు షాపూర్ నగర్ వైపు వెళ్ళడానికి రోడ్డు క్రాస్ చేయడానికి నెమ్మదిగా కదులుతున్న సమయంలో షాపూర్నగర్ నుంచి చింతల్ వైపు వేగంగా వస్తున్న ఓ ద్విచక్ర వాహనం (టీజీ 10 జెటీఆర్ 2587 ) ఢీ కొట్టింది. బైక్ పై ప్రయాణిస్తున్న గాజులరామారం వివేకానందనగర్ కు చెందిన విద్యార్థులు శివ శాంత్ (19) , భాను కిరణ్ (22) లు తీవ్రంగా గాయపడి కింద పడిపోయారు. అయితే పోలీస్స్టేషన్ ఎదురుగా పెద్ద శబ్దం రావడంతో గమనించిన పోలీసులు ప్రమాదస్థలికి పరుగులు పెట్టారు. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ సీఐ గడ్డం మల్లేష్, ఎస్ఐలు, సిబ్బంది ప్రమాదం జరిగిన చోటికి వెళ్ళి చూడగా తీవ్ర రక్తస్రావంతో బాధితులు రోడ్డుపై పడి ఉన్నారు. వెంటనే అటుగా వస్తున్న ఆటోలో బాధితులను స్వయంగా పోలీసులే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్ళారు. గాయపడిన విద్యార్థులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, వారి పరిస్థితి నిలకడగా ఉందని సీఐ గడ్డం మల్లేష్ తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ఇంటి నెంబరు కోసం రూ.5 వేలు లంచం..

# ఏసీబీ వలలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, బిల్ కలెక్టర్

* సుల్తానాబాద్‌లో లంచం తీసుకుంటూ ఇద్దరు మున్సిపల్ ఉద్యోగులు అరెస్ట్
* కొత్త ఇంటికి నంబర్ కేటాయించేందుకు రూ. 5 వేలు డిమాండ్
* బాధితుడి ఫిర్యాదుతో వల పన్ని పట్టుకున్న ఏసీబీ అధికారులు
* అరెస్టయిన వారిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, బిల్ కలెక్టర్
* లంచం అడిగితే 1064కు ఫోన్ చేయాలని ప్రజలకు ఏసీబీ విజ్ఞప్తి
* ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని



**స్పష్టీకరణ**

ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం తీసుకునే అధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఉక్కుపాదం మోపుతోంది. తాజాగా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పురపాలక సంఘంలో లంచం తీసుకుంటున్న ఇద్దరు ఉద్యోగులను ఏసీబీ అధికారులు శుక్రవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కొత్తగా నిర్మించిన ఇంటికి నంబర్ కేటాయించేందుకు ఓ పౌరుడి నుంచి రూ. 5,000 లంచం స్వీకరిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

**వివరాల్లోకి వెళితే..**

సుల్తానాబాద్‌కు చెందిన ఒక వ్యక్తి తాను కొత్తగా నిర్మించుకున్న ఇంటికి నంబర్ కేటాయించాలని కోరుతూ స్థానిక పురపాలక కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు కార్యాలయంలోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అనపర్తి వినోద్ కుమార్, బిల్ కలెక్టర్ నాంపల్లి విజయ్ కుమార్ రూ. 5,000 లంచం డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని ఆ వ్యక్తి నేరుగా తెలంగాణ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. ముందుగా అనుకున్న ప్రకారం, ఫిర్యాదుదారుడు శుక్రవారం నాడు కార్యాలయంలో వినోద్ కుమార్, విజయ్ కుమార్‌లకు రూ. 5,000 ఇస్తుండగా.. అక్కడే మాటువేసిన ఏసీబీ బృందం వారిని అదుపులోకి తీసుకుంది. లంచం డబ్బును స్వాధీనం చేసుకుని, ఇద్దరు ఉద్యోగులను అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు.

*** లంచం అడిగితే ఫిర్యాదు చేయండి: ఏసీబీ**

ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు కీలక సూచనలు చేశారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా సేవలు అందించడానికి లంచం అడిగితే ఏమాత్రం భయపడకుండా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేయాలని సూచించారు. అంతేకాకుండా వాట్సాప్ నంబర్ 9440446106 ద్వారా గానీ, ఫేస్‌బుక్, ఎక్స్ (@TelanganaACB) వంటి సామాజిక మాధ్యమాల ద్వారా గానీ, అధికారిక వెబ్‌సైట్ ద్వారా గానీ సంప్రదించవచ్చని తెలిపారు. లంచంపై ఫిర్యాదు చేసిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని అధికారులు భరోసా ఇచ్చారు.





# తెలంగాణలో భారీగా డీఎస్పీల బదిలీలు.. 44 మందికి స్థానచలనం

* ఉత్తర్వులు జారీ చేసిన డీజీపీ జితేందర్
* వివిధ విభాగాలకు అధికారుల స్థానచలనం
* సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలోనూ మార్పులు

తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖలో భారీగా బదిలీలు చోటు చేసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 44 మంది డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) స్థాయి అధికారులను బదిలీ చేస్తూ డీజీపీ జితేందర్ శనివారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఈ బదిలీలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా పలువురు అధికారులకు కీలక పోస్టింగులు కేటాయించారు. బదిలీ అయిన వారిలో వై. నాగేశ్వరరావును సైబరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) ఏసీపీగా నియమించారు. అదేవిధంగా, ఆకుల చంద్రశేఖర్‌కు మహేశ్వరం ట్రాఫిక్ ఏసీపీగా, సంపత్‌కుమార్‌కు రాచకొండ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏసీపీగా బాధ్యతలు అప్పగించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, కమిషనరేట్ల పరిధిలో పనిచేస్తున్న డీఎస్పీలకు స్థానచలనం కల్పిస్తూ ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

# మహాటీవీ ఆఫీసుపై దాడి.. తీవ్రంగా స్పందించిన రేవంత్ రెడ్డి

* మహాటీవీ కార్యాలయంపై జరిగిన దాడి ఘటన
* తీవ్రంగా ఖండించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
* దాడిని అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించిన రేవంత్ రెడ్డి
* ప్రజాస్వామ్యంలో ఇలాంటివి సమర్థనీయం కాదన్న ముఖ్యమంత్రి
* దాడిని ఖండించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి






ప్రముఖ తెలుగు వార్తా ఛానల్ మహాటీవీ కార్యాలయంపై జరిగిన దాడిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై ఆయన సామాజిక మాధ్యమం ద్వారా స్పందించారు. మీడియా సంస్థపై దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అని, దీనిని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇటువంటి దాడులకు ఏమాత్రం తావులేదని రేవంత్ రెడ్డి తన ప్రకటనలో పేర్కొన్నారు. మహా న్యూస్ కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ప్రజాస్వామ్యంలో హింసకు ఎటువంటి స్థానం లేదని, మీడియా సంస్థలపై దాడులు చేయడం అంటే ప్రజల అభిప్రాయ స్వేచ్ఛను అణచివేయాలనే దురుద్దేశంతో కూడిన చర్య అని ఆయన అన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఈ ఘటనను నిర్దాక్షిణ్యంగా చూడాలని, ఈ దాడిలో పాలుపంచుకున్నవారితో పాటు, ఈ దాడి వెనుక నిలిచినవారినీ గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను సూచిస్తున్నానని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను సహించేది లేదని, ప్రజాస్వామ్య విలువలను కాపాడడమే మనందరి బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు.

# తెలుగు రాష్ట్రాల బీజేపీ అధ్యక్ష ఎన్నికలకు రంగం సిద్ధం




బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ వేగవంతమైంది. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు నూతన అధ్యక్షులను ఎన్నుకునేందుకు పార్టీ అధిష్ఠానం కసరత్తు ముమ్మరం చేసింది. రెండు రాష్ట్రాలకు దాదాపు ఒకే సమయంలో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి, జులై 1న నూతన సారథులను ప్రకటించేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు పార్టీ వర్గాలు ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించాయి. తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక కోసం ఆదివారం (జూన్ 29) నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. సోమవారం (జూన్ 30) అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. అనంతరం జులై 1వ తేదీన ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తారు.

**ఏపీలోనూ మొదలైన ప్రక్రియ**

ఆంధ్రప్రదేశ్‌లోనూ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. కేవలం మూడు రోజుల్లోనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని పార్టీ అధిష్ఠానం ఆదేశించింది. ఈ వివరాలను పార్టీ రాష్ట్ర ఎన్నికల అధికారి, రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ విజయవాడలో మీడియా సమావేశంలో వెల్లడించారు. జూన్ 30న నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, అదే రోజు సాయంత్రంలోపు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని తెలిపారు. జులై 1వ తేదీ నాటికి పార్టీ నూతన అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ పూర్తవుతుందని ఆయన స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో వాహనదారులకు గుడ్ న్యూస్.. పీజేఆర్ ఫ్లైఓవర్ ప్రారంభం

* కొండాపూర్ - ఓఆర్ఆర్‌ను కలిపే పీజేఆర్ ఫ్లైఓవర్ ప్రారంభం
* ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం
* గచ్చిబౌలి జంక్షన్ వద్ద భారీగా తగ్గనున్న ట్రాఫిక్ రద్దీ
* హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు మెరుగుపడిన కనెక్టివిటీ
* 1.2 కిలోమీటర్ల పొడవుతో ఆరు వరుసలుగా ఫ్లైఓవర్ నిర్మాణం
* శంషాబాద్ విమానాశ్రయానికి వేగంగా ప్రయాణించే సౌకర్యం



హైదరాబాద్ నగరంలోని ఐటీ కారిడార్‌లో వాహనదారుల ట్రాఫిక్ కష్టాలకు ఉపశమనం కలిగిస్తూ మరో ఫ్లైఓవర్ అందుబాటులోకి వచ్చింది. కొండాపూర్ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వరకు నిర్మించిన పీజేఆర్ ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం లాంఛనంగా ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ కొత్త ఫ్లైఓవర్ నిర్మాణంతో హైదరాబాద్‌లో అత్యంత రద్దీ ప్రాంతాల్లో ఒకటైన గచ్చిబౌలి జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. మొత్తం 1.2 కిలోమీటర్ల పొడవు, 24 మీటర్ల వెడల్పుతో ఆరు వరుసలుగా ఈ ఫ్లైఓవర్‌ను ఆధునిక ప్రమాణాలతో నిర్మించారు. ఈ ఫ్లైఓవర్ ప్రారంభంతో ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్, హఫీజ్‌పేట్ మార్గాల్లో ప్రయాణించే వారికి ప్రయాణ సమయం గణనీయంగా ఆదా అవుతుంది. ముఖ్యంగా హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రధాన వాణిజ్య ప్రాంతాలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. కొండాపూర్, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులు ఇకపై ఎలాంటి ట్రాఫిక్ అడ్డంకులు లేకుండా నేరుగా ఔటర్ రింగ్ రోడ్డుకు చేరుకోవచ్చు. దీనివల్ల ఐటీ ఉద్యోగులు, స్థానిక నివాసితులు, విమానాశ్రయ ప్రయాణికులకు ఎంతో మేలు జరగనుంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# మీడియా సంస్థలపై కేటీఆర్ ఫైర్.. చట్టపరమైన చర్యలకు సిద్ధం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొన్ని మీడియా సంస్థలు, జర్నలిస్టుల వ్యవహారశైలిపై తీవ్రంగా మండిపడ్డారు. తనపై, తమ పార్టీ నాయకత్వంపై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కొన్ని నెలలుగా కొందరు వ్యక్తులు జర్నలిస్టుల ముసుగులో తన వ్యక్తిత్వాన్ని కించపరిచేలా పదేపదే ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. "జర్నలిస్టుల ముసుగులో కొందరు దుర్మార్గులు గత కొన్ని నెలలుగా నాపైనా, మా పార్టీ నాయకత్వంపైనా విషం చిమ్ముతున్నారు" అని ఆయన అన్నారు. ఇలాంటి వారి అభిప్రాయాలను, ఉనికిని తాను ఏమాత్రం ఖాతరు చేయనని ఆయన తేల్చి చెప్పారు. అయితే, ఈ నిరంతర వ్యక్తిగత దూషణల వల్ల తన కుటుంబ సభ్యులు, స్నేహితులు, పార్టీ సహచరులు మానసికంగా వేదనకు గురవుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కారణంగానే తాను చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించుకున్నానని ఆయన తెలిపారు. ఇలాంటి రాతలు రాస్తున్న ప్రతి ఒక్కరిపై కేసులు పెడతానని ఆయన హెచ్చరించారు. ఈ దాడుల వెనుక ఎవరున్నారనే విషయంపై కూడా కేటీఆర్ స్పందించారు. "ఈ వ్యవస్థీకృత దాడుల వెనుక ఎవరున్నారో నాకు తెలుసు.

# డీఎన్ఏ పరీక్షలు పూర్తి... అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతుల సంఖ్య 260గా నిర్ధారణ

* డీఎన్ఏ పరీక్షల ద్వారా మృతదేహాల గుర్తింపు ప్రక్రియ పూర్తి
* చివరి మృతదేహాన్ని కూడా గుర్తించి కుటుంబానికి అప్పగించిన అధికారులు
* దాదాపు రెండు వారాల్లోనే క్లిష్టమైన గుర్తింపు ప్రక్రియ పూర్తి
* మృతుల్లో 200 మంది భారతీయులు, 52 మంది బ్రిటిష్ పౌరులు

అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరణించిన వారి గుర్తింపు ప్రక్రియ ముగిసింది. ఈ దుర్ఘటనలో మృతి చెందిన వారి సంఖ్య 260 అని అధికారులు అధికారికంగా ధృవీకరించారు. గుర్తు పట్టడానికి వీలులేని విధంగా ఛిద్రమైన మృతదేహాలను గుర్తించేందుకు చేపట్టిన డీఎన్ఏ పరీక్షలు పూర్తయ్యాయని, చివరి మృతదేహాన్ని కూడా శుక్రవారం వారి కుటుంబ సభ్యులకు అప్పగించామని అధికారులు తెలిపారు. ఈ విషయంపై అహ్మదాబాద్ సివిల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ జోషి మాట్లాడుతూ, "విమాన ప్రమాదానికి సంబంధించి చివరి మృతదేహం డీఎన్ఏ నమూనా కూడా సరిపోయింది. ఆ మృత దేహాన్ని వారి కుటుంబానికి అప్పగించాం. దీంతో మృతులందరినీ వారి కుటుంబాలకు చేర్చినట్లయింది" అని అన్నారు.





ఈ ప్రమాదంలో గాయపడిన మరో ముగ్గురు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని ఆయన వివరించారు. జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయల్దేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే సమీపంలోని ఒక వైద్య కళాశాల హాస్టల్ భవనంపై కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో విమానంలో ప్రయాణిస్తున్న 242 మందిలో ఒకరు మినహా 241 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద స్థలంలో ఉన్న మరికొందరు కూడా మృతి చెందారు. తొలుత మృతుల సంఖ్య 270 వరకు ఉండవచ్చని అంచనా వేసినప్పటికీ, పూర్తిస్థాయి దర్యాప్తు అనంతరం ఆ సంఖ్య 260 అని అధికారులు వెల్లడించారు. మొత్తం 260 మంది మృతుల్లో 200 మంది భారతీయులు, 52 మంది బ్రిటిష్ పౌరులు, ఏడుగురు పోర్చుగల్ జాతీయులు, ఒక కెనడియన్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. జూన్ 23 నాటికే 259 మృతదేహాలను గుర్తించగా, ఒక మృతదేహం గుర్తింపు మాత్రం డీఎన్ఏ పరీక్షల కారణంగా పెండింగ్‌లో ఉంది. తాజాగా ఆ ప్రక్రియ కూడా పూర్తి కావడంతో మొత్తం లెక్క తేలింది.




# దేశంలో తొలి ఏఐ డిజిటల్ హైవే... ఎక్కడో తెలుసా?

* ఢిల్లీ-గురుగ్రామ్‌లను కలిపే ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేపై ఏఐ ఆధారిత స్మార్ట్ ట్రాఫిక్ వ్యవస్థ
* సీటు బెల్ట్, స్పీడ్ సహా 14 రకాల ఉల్లంఘనలను పసిగట్టే కెమెరాలు
* నిబంధనలు మీరితే నేరుగా పోలీసులకు, ఈ-చలాన్ పోర్టల్‌కు సమాచారం
* ప్రమాదాలు, అడ్డంకులను గుర్తించి వెంటనే కంట్రోల్ రూమ్‌ను అప్రమత్తం
* దేశవ్యాప్తంగా అన్ని జాతీయ రహదారులకు ఈ వ్యవస్థ విస్తరణకు ప్లాన్

భారత జాతీయ రహదారులు సరికొత్త టెక్నాలజీతో రూపు మార్చుకుంటున్నాయి. వాహనదారుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణే లక్ష్యంగా దేశంలోనే తొలిసారిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత 'అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఏటీఎంఎస్)' అందుబాటులోకి వచ్చింది. ఢిల్లీ గురుగ్రామ్‌లను కలిపే ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేపై ఈ స్మార్ట్ వ్యవస్థను తాజాగా ప్రారంభించారు. దీని ద్వారా దేశంలో తొలి ఏఐ ఆధారిత డిజిటల్ హైవేగా ఈ రహదారి గుర్తింపు పొందింది.

*** ఏమాత్రం తేడా వచ్చినా పసిగట్టేస్తుంది!**

ఈ అత్యాధునిక వ్యవస్థతో హైవేలపై నిబంధనల ఉల్లంఘనలకు చెక్ పెట్టడం చాలా సులువు కానుంది. వాహనదారులు సీటు బెల్టు పెట్టుకోకపోయినా, టూవీలర్‌పై ట్రిపుల్ రైడింగ్ చేసినా, పరిమితికి మించి వేగంతో ప్రయాణించినా ఈ స్మార్ట్ కెమెరాలు వెంటనే పసిగడతాయి. ఇలా దాదాపు 14 రకాల ట్రాఫిక్ ఉల్లంఘనలను ఈ ఏటీఎంఎస్ వ్యవస్థ గుర్తించగలదు. నిబంధనలు అతిక్రమించిన వాహనం వివరాలను వెంటనే ఎన్ఐసీ ఈచలాన్ పోర్టల్‌కు, సంబంధిత పోలీసు అధికారులకు చేరవేస్తుంది. దీంతో మానవ ప్రమేయం లేకుండానే ఆటోమేటిక్‌గా చలాన్లు జారీ అవుతాయి.

*** టెక్నాలజీ ఎలా పనిచేస్తుంది?**

భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ ఈ వ్యవస్థను అభివృద్ధి చేసింది. ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేతో పాటు ఎన్‌హెచ్48లోని 28 కిలోమీటర్ల మార్గంలో కలిపి మొత్తం 56.46 కిలోమీటర్ల పొడవునా ఈ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ప్రతి కిలోమీటర్‌కు ఒకటి చొప్పున మొత్తం 110 హైరిజల్యూషన్ పీటీజెడ్ కెమెరాలను అమర్చారు. ఇవి 24 గంటలూ రహదారిపై జరిగే ప్రతి కదలికను రికార్డు చేస్తాయి. ట్రాఫిక్ పర్యవేక్షణ, ప్రమాదాలను వీడియో తీయడం, వాహన వేగాన్ని గుర్తించడం, అవసరమైన సందేశాలను డిజిటల్ బోర్డులపై ప్రదర్శించడం, సెంట్రల్ కంట్రోల్ రూమ్ వంటివి ఈ వ్యవస్థలో ప్రధాన భాగాలు.

*** డిజిటల్ బ్రెయిన్‌లా పనిచేసే కంట్రోల్ రూమ్**

ఈ మొత్తం వ్యవస్థకు కమాండ్ సెంటర్ ఒక 'డిజిటల్ బ్రెయిన్' లాగా పనిచేస్తుంది. రహదారిపై ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే స్థానిక సిబ్బందికి, జాతీయ రహదారి అధికారులకు సమాచారం అందిస్తుంది. అంతేకాకుండా, దట్టమైన పొగమంచు ఏర్పడినా, రోడ్డుపై ఏవైనా అడ్డంకులు ఉన్నా లేదా జంతువులు ప్రవేశించినా వెంటనే సంబంధిత సిబ్బందిని అప్రమత్తం చేసి తగిన చర్యలు తీసుకునేలా చేస్తుంది.

# డిజిటల్ అరెస్ట్ పేరుతో లేడీ డాక్టర్ కు టోకరా... రూ.3 కోట్లు వసూలు!

* ముంబైలో 70 ఏళ్ల వృద్ధ వైద్యురాలికి భారీ సైబర్ మోసం
* డిజిటల్ అరెస్ట్ పేరుతో 8 రోజుల పాటు వర్చువల్ నిర్బంధం
* మనీలాండరింగ్ కేసులో ఇరికిస్తామని నకిలీ ఐపీఎస్ అధికారి బెదిరింపు
* భయపెట్టి విడతలవారీగా రూ.3 కోట్లకు పైగా నగదు బదిలీ
* పోలీసుల దర్యాప్తులో రూ.82 లక్షలు క్రిప్టోలోకి మార్చినట్లు గుర్తింపు
* డిజిటల్ అరెస్ట్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పంథాలో అమాయకులను మోసగిస్తున్నారు. తాజాగా 'డిజిటల్ అరెస్ట్' పేరుతో సాగుతున్న మోసాలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. చట్టం, పోలీసులంటే ఉండే భయాన్ని ఆసరాగా చేసుకుని, ప్రముఖ కేసుల్లో ప్రమేయం ఉందంటూ బెదిరించి భారీగా డబ్బులు దండుకుంటున్నారు. ఈ తరహా మోసానికి గురైన ముంబైకి చెందిన 70 ఏళ్ల వైద్యురాలు ఏకంగా రూ.3 కోట్లు పోగొట్టుకున్నారు. నేరగాళ్లు ఆమెను 8 రోజుల పాటు డిజిటల్ మాధ్యమంలో నిర్బంధించి ఈ దారుణానికి పాల్పడ్డారు.

*** అసలేం జరిగిందంటే...!**

ముంబైలో నివసిస్తున్న 70 ఏళ్ల వైద్యురాలికి మే 28న అమిత్ కుమార్ అనే వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. తాను టెలికాం డిపార్ట్‌మెంట్ నుంచి మాట్లాడుతున్నానని పరిచయం చేసుకున్న ఆ వ్యక్తి, "మీ ఆధార్ కార్డు ఉపయోగించి గుర్తుతెలియని వ్యక్తులు కొత్త సిమ్ కార్డు తీసుకున్నారు. ఆ సిమ్ కార్డు వినియోగదారుడిపై ఇప్పటికే కేసు నమోదైంది" అని చెప్పి ఆమెలో ఆందోళన రేకెత్తించాడు. ఆ తర్వాత కొద్దిసేపటికే, ముంబై సైబర్ క్రైమ్ విభాగం పేరుతో ఆమె వాట్సాప్‌కు ఒక సందేశం వచ్చింది. కేసు విచారణకు వ్యక్తిగత వివరాలు పంపాలని కోరగా, భయపడిన ఆమె వారు అడిగిన వివరాలన్నీ పంపించారు.

*** నకిలీ ఐపీఎస్ అధికారి రంగప్రవేశం**

కొన్ని రోజుల తర్వాత, అదే వాట్సాప్ నంబర్ నుంచి ఆమెకు మరో కాల్ వచ్చింది. ఈసారి ఫోన్ చేసిన వ్యక్తి, తాను ముంబై క్రైమ్ బ్రాంచ్‌లో పనిచేసే ఐపీఎస్ అధికారి సమర్థన్ పవార్‌ను అంటూ పరిచయం చేసుకున్నాడు. జెట్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడు నరేశ్ గోయల్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆమె పేరు కూడా ఉందని నమ్మబలికాడు. గోయల్ ఇంట్లో సోదాలు చేస్తుండగా ఆమె పేరు మీద ఉన్న బ్యాంక్ అకౌంట్, డెబిట్ కార్డు దొరికాయని, ఈ కేసులో తీవ్రమైన శిక్ష పడుతుందని బెదిరించాడు. తన మాటలను ఆమె నమ్మేందుకు, కేసుకు సంబంధించినవంటూ కొన్ని నకిలీ పత్రాలను కూడా వాట్సాప్‌లో పంపించాడు.

*** 8 రోజుల డిజిటల్ నిర్బంధం**

ఈ పరిణామాలతో తీవ్ర భయాందోళనలకు గురైన బాధితురాలికి, పోలీసు దుస్తుల్లో ఉన్న ఓ వ్యక్తి వీడియో కాల్ చేసి మాట్లాడాడు.



మనీలాండరింగ్ కేసు తీవ్రమైనది కావడంతో ఆమెను 'డిజిటల్ అరెస్ట్' చేస్తున్నట్లు ప్రకటించాడు. 8 రోజుల పాటు ఎక్కడికీ వెళ్లకూడదని, ఎవరితోనూ మాట్లాడకూడదని, నిరంతరం తమ పర్యవేక్షణలో ఉండాలని ఆదేశించాడు. విచారణలో భాగంగా ఆమె బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బును తాము చెప్పే వేర్వేరు ఖాతాలకు బదిలీ చేయాలని, ఆ డబ్బును పరిశీలించాక తిరిగి పంపుతామని ఒత్తిడి చేశాడు. కేసు నుంచి బయటపడాలనే ఆందోళనలో ఉన్న ఆ వైద్యురాలు, వారు చెప్పినట్టే విడతలవారీగా దాదాపు రూ.3 కోట్లను వారి ఖాతాలకు బదిలీ చేసింది. 8 రోజుల తర్వాత, కేసు నుంచి విముక్తి కల్పిస్తున్నామని చెప్పి నేరగాళ్లు ఆమెతో సంబంధాలు తెంచుకున్నారు. జరిగిన విషయాన్ని బంధువులకు చెప్పడంతో, ఇది సైబర్ మోసమని వారు అనుమానించారు. వెంటనే బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు కాజేసిన సొమ్ములో నుంచి రూ.82 లక్షలను ఇప్పటికే క్రిప్టో కరెన్సీ రూపంలోకి మార్చినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. ఈ ముఠా వెనుక ఉన్న సూత్రధారుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# భారత గూఢచార సంస్థ 'రా' కొత్త చీఫ్ గా పరాగ్ జైన్

* 'రా' తదుపరి చీఫ్ గా పరాగ్ జైన్ నియామకం
* ప్రస్తుత చీఫ్ రవి సిన్హా స్థానంలో బాధ్యతలు
* రెండేళ్ల పాటు పదవిలో కొనసాగనున్న జైన్
* ఇంటెలిజెన్స్ వర్గాల్లో 'సూపర్ స్లూత్'గా గుర్తింపు
* ఆపరేషన్ సిందూర్‌లో కీలక పాత్ర పోషించిన వైనం
* జైన్ 1989 పంజాబ్ కేడర్ ఐపీఎస్ అధికారి






భారత గూఢచార సంస్థ రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా) నూతన అధిపతిగా సీనియర్ ఐపీఎస్ అధికారి పరాగ్ జైన్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుత చీఫ్ రవి సిన్హా పదవీకాలం జూన్ 30తో ముగియనున్న నేపథ్యంలో ఈ నియామకం జరిగింది. జూలై 1 నుంచి పరాగ్ జైన్ రెండేళ్ల పాటు ఈ కీలక బాధ్యతలను నిర్వర్తిస్తారు. 1989 బ్యాచ్‌కు చెందిన పంజాబ్ కేడర్ ఐపీఎస్ అధికారి అయిన పరాగ్ జైన్, గతంలో పంజాబ్ డీజీపీగా కూడా సేవలు అందించారు. 2021 జనవరి 1న ఆయన డీజీపీ హోదా పొందారు. ఆయన నియామకానికి క్యాబినెట్ నియామకాల కమిటీ జూన్ 2న ఆమోదముద్ర వేసింది. గూఢచార వర్గాల్లో పరాగ్ జైన్‌కు 'సూపర్ స్లూత్' అనే పేరుంది. మానవ మేధస్సు (హ్యూమింట్), సాంకేతిక మేధస్సును (టెక్ఇంట్) సమర్థవంతంగా మిళితం చేసి క్లిష్టమైన ఆపరేషన్లను విజయవంతం చేయడంలో ఆయన దిట్ట అని అధికారులు చెబుతుంటారు. ఈ నైపుణ్యమే అత్యున్నత స్థాయి ఆపరేషన్లకు కీలకంగా నిలుస్తుందని వారు వివరిస్తున్నారు. ఇటీవల పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే) లక్ష్యంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో పరాగ్ జైన్ కీలక పాత్ర పోషించారు. ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై కచ్చితమైన దాడులు చేసేందుకు ఆయన బృందం అందించిన ఇంటెలిజెన్స్ సమాచారం భారత బలగాలకు ఎంతగానో ఉపయోగపడింది. వీటితో పాటు, జమ్మూ కాశ్మీర్‌లో పనిచేసిన సుదీర్ఘ అనుభవం కూడా పరాగ్ జైన్‌ను ఈ పదవికి ఎంపిక చేయడంలో దోహదపడింది. గతంలో ఆయన కెనడా, శ్రీలంక వంటి దేశాల్లోనూ భారత ప్రతినిధిగా దౌత్యపరమైన సేవలు అందించారు.

# బెంగాల్‌లో మరో అఘాయిత్యం: తీవ్రంగా స్పందించిన 'ఆర్జీకర్' మృతురాలి తండ్రి

పశ్చిమ బెంగాల్‌లో మహిళల భద్రతపై మరోమారు ఆందోళన వ్యక్తమవుతోంది. కోల్‌కతాలోని ఆర్జీకర్ వైద్య కళాశాల విద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటన మరువకముందే, తాజాగా ఒక న్యాయ కళాశాల ప్రాంగణంలోనే 24 ఏళ్ల విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగిన ఘటన కలకలం రేపుతోంది. ఈ ఘటనలో ప్రధాన నిందితుడికి అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు రాజకీయ దుమారాన్ని రేకెత్తిస్తున్నాయి.

**క్యాంపస్‌లోనే దారుణం**

కోల్‌కతాలోని ఒక న్యాయ కళాశాలలో చదువుతున్న విద్యార్థినిపై అదే కళాశాలకు చెందిన ఇద్దరు సీనియర్లు, ఒక పూర్వ విద్యార్థి కలిసి క్యాంపస్‌లోనే ఈ దారుణానికి పాల్పడ్డారు. బాధితురాలిపై సామూహిక అత్యాచారం జరిగినట్లు వైద్య పరీక్షల్లో నిర్ధారణ అయిందని ఒక సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి గురువారం ఇద్దరిని, శుక్రవారం ప్రధాన నిందితుడైన మనోజిత్ మిశ్రా (31)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తనను వదిలేయమని వేడుకున్నా నిందితులు కనికరించలేదని, ఈ అఘాయిత్యాన్ని వీడియో తీసి అందరికీ పంపిస్తామని బెదిరించారని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. తాను తప్పించుకునేందుకు ప్రయత్నించగా హాకీ స్టిక్‌తో దాడి చేశారని ఆమె పోలీసులకు వివరించింది.

*** ప్రభుత్వ నిర్లక్ష్యంపై 'ఆర్జీకర్' బాధితురాలి తండ్రి ఆగ్రహం**

ఈ ఘటనపై గతంలో హత్యాచారానికి గురైన ఆర్జీకర్ వైద్య విద్యార్థిని తండ్రి తీవ్రంగా స్పందించారు. టీఎంసీ ప్రభుత్వ ఉదాసీనత వల్లే రాష్ట్రంలో ఇలాంటి దారుణాలు పునరావృతమవుతున్నాయని ఆయన ఆరోపించారు. "నా కుమార్తె విషయంలో వేలాది మంది రోడ్లపైకి వచ్చి పోరాడారు. అయినా మహిళలపై అఘాయిత్యాలు ఆగడం లేదు. నా కుమార్తెలాంటి అభాగ్యులు ఇంకెంత మంది ప్రభుత్వ నిర్లక్ష్యానికి బలి కావాలి? ఈ కేసులో నిందితులకు కఠిన శిక్ష పడినప్పుడే ఇటువంటివి ఆగుతాయి" అని ఆయన అన్నారు.

# ఆన్ లైన్ మోసాలు పెరిగాయి... ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: హోంమంత్రి

* విజయవాడలో 'సురక్షా 360' కార్యక్రమాన్ని ప్రారంభించిన హోంమంత్రి అనిత
* సీసీ కెమెరాల ఏర్పాటుతో రాష్ట్రంలో నేరాలు తగ్గాయన్న మంత్రి
* టెక్నాలజీ వాడకంలో ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్ ముందుందని ప్రశంస
* ప్రతి గ్రామం, వీధి నిఘా నీడలోకి తీసుకురావడమే లక్ష్యమని వెల్లడి
* ఆలయాలు, చర్చిలు, మసీదుల కోసం 28 సురక్షా డివైస్ కిట్ల పంపిణీ
* ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

"గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వాట్సాప్ సందేశాలు, అనుమానా స్పద లింకుల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండండి. క్షణికావేశంలో వాటిని క్లిక్ చేస్తే మీ కష్టార్జితం మొత్తం సైబర్ నేరగాళ్ల పాలవుతుంది" అంటూ రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రజలను తీవ్రంగా హెచ్చరించారు. ఇటీవల కాలంలో ఆన్‌లైన్ మోసాలు విపరీతంగా పెరిగిపోయాయని, సాంకేతికతను మంచి కోసం ఎంతగా వాడుతున్నామో, చెడుకు కూడా అంతేస్థాయిలో



వినియోగిస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడలో శనివారం జరిగిన 'సురక్షా 360' కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

## టెక్నాలజీతోనే నేరాలకు అడ్డుకట్ట

సైబర్ నేరాలతో పాటు, భౌతిక నేరాలను కూడా సాంకేతిక పరిజ్ఞానంతోనే అరికట్టగలమని మంత్రి అనిత స్పష్టం చేశారు. "రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ప్రతి వీధి, ప్రతి గ్రామాన్ని సీసీ కెమెరాల నిఘా నీడలోకి తీసుకురావడమే మా లక్ష్యం. టెక్నాలజీ వినియోగంలో ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్ ముందుండటం అభినందనీయం" అని ఆమె అన్నారు. నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, వాటి ఏర్పాటుతో రాష్ట్రవ్యాప్తంగా నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని పేర్కొన్నారు.

* ప్రార్థనా మందిరాలకు 'సురక్షా' కవచం

ఈ కార్యక్రమంలో భాగంగా, జిల్లాలోని ఆలయాలు, చర్చిలు, మసీదుల భద్రత కోసం ప్రత్యేకంగా రూపొందించిన 28 'సురక్షా డివైస్ కిట్ల'ను మంత్రి పంపిణీ చేశారు. ఈ పరికరాల ద్వారా ప్రార్థనా మందిరాల వద్ద నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ, "ప్రజల భాగస్వామ్యంతోనే నేరరహిత సమాజం సాధ్యం. 'సురక్షా 360' కార్యక్రమం ద్వారా కమ్యూనిటీ పోలీసింగ్‌ను బలోపేతం చేసి, ప్రతి పౌరుడికి భద్రతాభావం కల్పిస్తాం" అని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, ఇతర ప్రజాప్రతినిధులు, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం... ఉత్తరాంధ్రకు వర్ష సూచన

* ఉత్తర బంగాళాఖాతంలో రేపు అల్పపీడనం ఏర్పాటు
* ఉత్తరాంధ్ర జిల్లాలపై ఎక్కువగా ప్రభావం చూపే అవకాశం
* శ్రీకాకుళం, విశాఖ సహా 5 జిల్లాల్లో మోస్తరు వర్షా లు
* మిగతా జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి జల్లులు
* హెచ్చరికలు జారీ చేసిన ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరోసారి వర్షాలు పలకరించనున్నాయి. ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. విపత్తుల నిర్వహణ సంస్థ అందించిన సమాచారం ప్రకారం, ఉత్తర బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో ఆదివారం నాటికి ఒక అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. దీని ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పై కూడా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ అల్పపీడనం కారణంగా ప్రధానంగా ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం జిల్లాల్లో రేపు కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవవచ్చని ఏపీఎస్డీఎంఏ తెలిపింది. అదే సమయంలో, రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని పేర్కొంది. వాతావరణంలో చోటుచేసుకుంటున్న ఈ మార్పుల నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# అమృత్ స్కీమ్ ద్వారా తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటు: మంత్రి

అమరావతి: మున్సిపల్ శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో జరిగిన సమీక్షకు మంత్రి నారాయణ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. సమీక్ష అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనుల కోసం 201419 మధ్య కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చామని గుర్తు చేశారు. రూ.5,800 కోట్ల ఏఐఐబీ నిధులు, రూ.300 కోట్ల స్వచ్ఛభారత్ నిధులకు ఆమోదం వచ్చిందని వెల్లడించారు. గత ప్రభుత్వం రాష్ట్ర




వాటా ఇవ్వకపోవడంతో మధ్యలోనే నిధులు నిలిచిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక సమస్యలు పరిష్కరించి మళ్లీ నిధులు తీసుకొస్తున్నామన్నారు. అమృత్ స్కీమ్ ద్వారా తాగునీటి పైప్‌లైన్ పనుల కోసం నిన్న టెండర్లు పిలిచామని తెలిపారు. 2014 19 మధ్యలో 10 వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ప్రస్తుతం గుంటూరు, విశాఖ ప్లాంట్‌లలో 2800 టన్నుల చెత్త నుంచి విద్యుత్ తయారు చేస్తున్నారని.. నెల్లూరు, రాజమహేంద్రవరం ప్లాంట్‌లకు టెండర్లు పూర్తయ్యాయని తెలిపారు. కడప, కర్నూలు, విజయవాడ, తిరుపతిలో ప్లాంట్‌ల ఏర్పాటుకు త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు. ఈ ప్లాంట్‌లు పూర్తయితే 7500 టన్నుల చెత్త రోజూ విద్యుత్ తయారీకి వెళ్లి పోతుందని మంత్రి నారాయణ తెలిపారు.

# వల్లభనేని వంశీకి మరో బిగ్ షాక్.. సుప్రీంకోర్టుకు ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కి మరో బిగ్ షాక్ తగిలింది. ఏపీ హైకోర్టు బెయిల్ ఇవ్వడంపై సుప్రీంకోర్టు లో ఏపీ ప్రభుత్వం సవాల్ చేసింది. ఏసీబీ కేసు లో పీటీ వారెంట్ జారీ అమలు చేస్తున్నారంటూ వల్లభనేని వంశీ హైకోర్టుకు వెళ్లారు. దీంతో వెకేషన్ కోర్టులో ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. అయితే ఈ తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని ప్రభుత్వానికి హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నివేదిక అందజేశారు. ఈ మేరకు వల్లభనేని వంశీ బెయిల్‌పై సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా సుప్రీంకోర్టు





అడ్వకేట్ ఆన్ రికార్డ్స్‌కు ఆదేశాలు జారీ చేసింది. గన్నవరంలో మట్టి తవ్వకాలకు సంబంధించి విజిలెన్స్ నివేదిక ప్రకారం కేసు నమోదు చేశారు. దీంతో ఏసీబీ కేసులో పీటీ వారెంట్ అమలు చేస్తున్నారని హైకోర్టుకు వెళ్లారు వల్లభనేని వంశీ.


# ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు: మంత్రి నిమ్మల

పాలకొల్లు: ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. జగన్ ఐదేళ్ల పాలన ఎలా ఉందో ప్రజలు ప్రత్యక్షంగా చూశారని, వైకాపా ప్రభుత్వ హయాంలో ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైందని విమర్శించారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలో పర్యటించిన మంత్రి నిమ్మల.. జల్‌జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. అన్నిచోట్లా దోచేసి.. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన చరిత్ర జగన్‌దని మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని



ఆయన గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం ఈ శతాబ్దపు విడ్డూరమని ఎద్దేవా చేశారు.

# మంత్రాలయంలో మోసాలు.. శీఘ్ర దర్శనం పేరుతో భక్తులకు వల!



పవిత్ర తుంగభద్ర నది తీరంలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం. శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనానికి విచ్చేసే భక్తులను టార్గెట్ చేస్తూ ఇటీవల కాలంలో మోసాలు పెరిగిపోయాయి. శీఘ్ర దర్శనం చేయిస్తామంటూ నమ్మబలికి వందల, వేల రూపాయలు దండుకుంటున్న మధ్య దళారీలు ఆగడాలు అధికమయ్యాయని వచ్చిన ఆరోపణలపై శ్రీ మఠం మేనేజర్ ఎస్.కె. శ్రీనివాసరావు స్పందించారు. భక్తుల నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని, కొందరు అక్రమార్కులు తాము దేవస్థాన సిబ్బందిగానో, వారికి తెలిసిన వారిగానో చెప్పుకుంటూ ఈ మోసాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, దర్శనం త్వరగా పూర్తి చేసుకోవాలనే తపనతో ఈ దళారుల వలలో పడుతున్నారు. శీఘ్ర దర్శనం, ప్రత్యేక పూజలు వంటివి ఏర్పాటు చేస్తామంటూ భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసి, ఆ తర్వాత మొహం చాటేస్తున్నారని శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ మోసాల కారణంగా భక్తులు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా, పవిత్ర శ్రీ క్షేత్రంలో ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీ మఠం నిబంధనల ప్రకారం, శీఘ్ర దర్శనం లేదా ఏదైనా ప్రత్యేక సేవల కోసం నిర్ణీత రుసుము చెల్లించి, అధికారిక కౌంటర్ల ద్వారా మాత్రమే టికెట్లు పొందాలి. మధ్యవర్తులను ఆశ్రయించడం ద్వారా మోసపోవడం ఖాయమని ఆలయ అధికారులు ఇప్పటికే పలుమార్లు హెచ్చరించారు. ఈ తరహా మోసాలను అరికట్టేందుకు శ్రీ మఠం అధికారులు, పోలీసులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే, భక్తులు కూడా అప్రమత్తంగా ఉండి, ఇలాంటి మోసాలకు బలవ్వకుండా చూసుకోవాలని మేనేజర్ శ్రీనివాసరావు సూచించారు.

# టీవీ ఛానెల్ ప్రధాన కార్యాలయంపై దాడి గర్హనీయం: పవన్ కల్యాణ్

హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఓ టీవీ ఛానెల్ ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడిని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఖండించారు. ఇది గర్హనీయమైన చర్య అన్నారు. మీడియాలో ప్రసారమయ్యే, పత్రికల్లో ప్రచురితమయ్యే వార్తలు, కథనాలపై అభ్యంతరాలుంటే నిరసన తెలిపేందుకు ఓ విధానముందని, అందుకు భిన్నంగా దాడులకు పాల్పడటం సమంజసం కాదని అన్నారు. న్యూస్ ఛానెల్‌పై జరిగిన దాడిని ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని కోరారు. ఈ దాడికి కారకులైన వారిపై చట్ట



ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# మరోసారి తమ దొంగబుద్ధిని బయటపెట్టుకున్న వైసీపీ కార్యకర్తలు

గతంలో పలువురు వైసీపీ నేతలు దొంగ బుద్ధి చూపించబోయి రాష్ట్రంలో పలుచోట్ల అడ్డంగా బుక్కయిన ఘటనలు నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే మరోసారి సైతం వైసీపీ కార్యకర్తలు తమ దొంగబుద్ధిని బయటపెట్టుకున్నారు. అనంతపురంలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని వైసీపీ నేతలు నిర్వహించారు. జవహర్ కాలనీలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సజ్జల రామకృష్ణారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, అనంత వెంకట్రామిరెడ్డి హాజరయ్యారు. ఇందులో భాగంగా వైసీపీ కార్యకర్తలు బోయ ఎర్రప్ప కుటుంబం వద్దకు వెళ్లి ఫోన్ స్కాన్ చేస్తే చంద్రబాబు మోసాలు బయటపడతాయని చెప్పారు. దీంతో వాళ్ల ఫోన్ తీసుకుని పే స్కాన్ చేసి డబ్బులు కొట్టేశారు. డబ్బులు కట్ అయిన్ మెసేజ్‌ను కూడా డిలీట్ చేశారు. అనంతరం ఫోన్‌ను తిరిగి ఇచ్చేశారు. అయితే ఎర్రప్ప ఓ షాపు వద్దకు వెళ్లారు. పలు సామాగ్రి కొన్నారు. అనంతరం డబ్బులు చెల్లించేందుకు ఫోన్ పే స్కాన్ చేశారు. కానీ డబ్బులు కట్ కాలేదు. చెక్ ద అమౌంట్ అంటూ చూపించింది. దీంతో బ్యాలెన్స్ చెక్ చేయగా జీరో అమౌంట్ అని చూపించింది. అకౌంట్లో ఉన్న రూ.11 వేలు కొట్టేసినట్లు ఎర్రప్ప గుర్తించారు. అనంతపురం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు



దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.

# చేయంతా... గోరింట!

**ఆషాఢం వచ్చింది. ఈ మాసమనగానే మనకి గుర్తొచ్చేది గోరింటాకే! ఎర్రగా పండిన చేతులతో అమ్మాయిలు చేసే సందడే వేరు. కానీ అందరికీ గోరింటాకు రుబ్బి, పెట్టుకునే ఓపిక, అవకాశం ఉండదు కదా! అలాంటివారికి సాయపడేలా బోలెడు మార్గాలున్నాయి.**








## సులువుగా ఇంజెక్షన్

కోన్‌తో అందమైన డిజైన్లు వేయడం అందరికీ అంత సులువేమీ కాదు. అలాంటి వారికి ఈ ఇంజెక్షన్లు మేలు. ఒకరకంగా లిక్విడ్ హెన్నా అని చెప్పొచ్చు. కొద్దికొద్దిగా ఒత్తుతూ చేతులపై డిజైన్లు వేయడమే. చిన్న చిన్న మెలికలు, చుక్కలతో మాయ చేసేయొచ్చు అనుకునేవాళ్లు వీటిని ఎంచుకుంటే సరి. లేదంటే ట్యూబ్స్ సాయమైనా తీసుకోవచ్చు. ఇవైతే వంగిపోతాయి, కోన్ పట్టుకోవడానికి వీలుగా లేదు అన్న బెంగా ఉండదు.








## కావాల్సిన డిజైన్ క్షణాల్లో...

ఇప్పుడు వేడుకేదైనా అరచేతిలో మెసేజ్ ఉండాల్సిందే! పెళ్లి, సీమంతం, పుట్టినరోజు ఏదైనా తగ్గట్టుగా బొమ్మలతో అరచేతిలో అందంగా తీర్చిదిద్దించుకుంటున్నారు. పెట్టేవాళ్లు నిపుణులైతే సరే. లేదంటే ప్రయత్నం వృథా, మనకీ బాధ. ఇదంతా ఎందుకొచ్చింది అనిపిస్తే 'ఫిగర్' లేదా 'డిజైన్' స్టెన్సిల్స్‌ని తెచ్చుకుంటే సరి. ఆక్రిలిక్‌వి వస్తున్నాయి. వాటిని ఇంక్‌ప్యాడ్‌కి అద్ది, చేతిమీద గుర్తు వేయడమే. దాని ఆధారంగా కోన్‌తో గీసుకుంటూ వస్తే సరి. కోరుకున్న మెహందీ డిజైన్ చేతులమీద చక్కగా ఇమిడిపోతుంది.

## రంగు.. నిలిచేలా...

గోరింట పెట్టుకుని కడిగేసిన క్షణం నుంచి చేతులు పదే పదే చూసుకుని మురవని అమ్మాయుండదు. ఆ రంగు మీద అంత మనసు పారేసుకుంటాం. ఎంత జాగ్రత్తగానైనా పెట్టుకోని... ఎంతసేపైనా ఉంచుకోనీ రంగు వెరవక మానదు కదా! కోన్‌తో పెట్టినవైతే మరీ త్వరగా రంగు పోతుంది. ఎంత వాస్తవం తెలిసినా ఆ సమయంలో మనసు కాస్త బాధపడుతుంది. ఇంకొన్ని రోజులు ఉంటే బాగుణ్ణు అనీ అనిపిస్తుంది. ఇలాంటప్పుడే మెహందీ ఆయిల్ సాయం కావాలి. దీన్ని మెహందీలో కలిపి పెట్టుకోవచ్చు. లేదా పెట్టుకున్నాక అద్దినా సరే. గోరింట మంచి రంగు వచ్చేలా చూడటమే కాదు, ఎక్కువ రోజులు నిలిచి ఉండేలానూ చేస్తుందట.



# ఆ మొక్కల్ని మళ్లీ నాటేటప్పుడు..!

**ఇంట్లో ఖాళీ స్థలంతో సంబంధం లేకుండా కుండీల్లో మొక్కల్ని పెంచుకోవడం ఈ రోజుల్లో చాలామందికి కామనైపోయింది. అయితే కొన్ని మొక్కలు పెరిగే కొద్దీ.. వాటి వేర్లు విస్తరించి కుండీ పగిలిపోయినప్పుడు లేదంటే ఏపుగా పెరగాలని.. ఇప్పుడున్న కుండీ నుంచి కొత్త కుండీకి మార్చడం.. వంటివి చేస్తుంటారు కొందరు. ఈ క్రమంలో తెలిసో తెలియకో చేసే కొన్ని పొరపాట్ల వల్ల మొక్కల ఆరోగ్యం దెబ్బతింటుందంటున్నారు నిపుణులు. అందుకే మొక్కల కుండీలు మార్చే క్రమంలో పలు జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యమంటున్నారు. అవేంటో తెలుసుకుందాం రండి..**



### * సైజు ముఖ్యం!

>> ఇప్పుడున్న కుండీ నుంచి కొత్త కుండీలోకి మొక్కల్ని మార్చే క్రమంలో కాస్త పెద్ద సైజు కుండీనే ఎంచుకోవడం చాలామందికి అలవాటు! కానీ దీనివల్ల మొక్కలకు అవసరానికి మించి నీళ్లు అందే అవకాశం ఉన్నట్లు, దీనివల్ల మొక్క కుళ్లిపోయే ప్రమాదం ఉంటుందంటున్నారు నిపుణులు. అందుకే కొత్త కుండీ సైజు మరీ పెద్దగా కాకుండా.. ఇప్పుడున్న సైజు కంటే ఒక అంకె ఎక్కువగా ఉన్నది తీసుకుంటే సరిపోతుందంటున్నారు.

### * మట్టిలోనూ తేడాలొద్దు!

>> మొక్కల్ని ఒక కుండీ నుంచి మరో కుండీలోకి మార్చేటప్పుడు అందులో నింపే మట్టి విషయంలోనూ జాగ్రత్తపడడం మంచిదంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో అంతకుముందు మొక్క పెరిగిన మట్టి మిశ్రమం లాంటిదే కొత్త కుండీలోనూ వేయడం మంచిదంటున్నారు. దీనివల్ల మొక్కకు అందే పోషకాల విషయంలో లోపం లేకుండా ఉంటుంది. అలాగే కొన్ని మొక్కలకు రోజంతా నీటి అవసరం ఉంటుంది.. మరికొన్ని మొక్కలు పొడిగా ఉండే మట్టిలోనూ ఏపుగా పెరుగుతాయి. కాబట్టి ఆయా మొక్కల అవసరాల్ని బట్టి కూడా తేమను నిలిపి ఉంచేలా లేదంటే కాసేపటికే పొడిగా మారే తత్వం ఉన్న మట్టిని ఎంచుకోవాల్సి ఉంటుంది. అప్పుడే కుండీ మార్చినా మొక్క ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడకుండా జాగ్రత్తపడచ్చు.



### * అనువైన కాలంలో..

>> ఆయా కాలాలతో సంబంధం లేకుండా తోచినప్పుడు మొక్కల్ని ఒక కుండీలో నుంచి మరో కుండీలోకి మార్చుతుంటారు చాలామంది. ఇలాంటి సందర్భాల్లో చాలావరకు మొక్కలు ఎండిపోవడం గమనిస్తుంటాం. మొక్కల్ని తిరిగి నాటే విషయంలో అవగాహన లోపమే ఇందుకు కారణమంటున్నారు నిపుణులు. ఎప్పుడు పడితే అప్పుడు వీటిని ఒక కుండీలో నుంచి మరో కుండీలోకి మార్చడం వల్ల వాటి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందట! అందుకే మొక్కలు చిగురించేందుకు అనువైన కాలంలో మాత్రమే కొత్త మొక్కలు నాటడం, పాత మొక్కల్ని మరో కుండీలో నాటడం మంచిదంటున్నారు నిపుణులు.



### * వేర్లు జాగ్రత్త!

>> ఒక కుండీలోని మొక్కల్ని మరో కుండీలోకి మార్చినప్పుడు లేదంటే తిరిగి నాటినప్పుడు.. కేవలం మొక్కతో పాటు కొంతవరకున్న వేర్లను మాత్రమే తీసుకుంటుంటారు చాలామంది. కానీ ఇది సరికాదంటున్నారు నిపుణులు. మొక్కల్ని పాత కుండీ నుంచి వేరు చేసినా.. తిరిగి నాటేటప్పుడు కూడా పూర్తి వేర్లతో తీసుకోవడం.. అవి డ్యామేజ్ కాకుండా తిరిగి మట్టిలో కూర్చడం.. ఈ రెండూ ముఖ్యమంటున్నారు. అప్పుడే అవి మట్టితో అనుబంధాన్ని పెనవేసుకోగలవని, ఆరోగ్యంగా ఎదగగలవని చెబుతున్నారు. ఇక్కడ మరో విషయం ఏంటంటే.. ఇలా తిరిగి నాటే క్రమంలో కుళ్లిపోయిన వేర్లు ఏమైనా ఉంటే ముందే కట్ చేయడం మంచిది. అప్పుడే మొక్క ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడకుండా జాగ్రత్తపడచ్చు.

### * నీళ్లు ఎక్కువ వద్దు!

>> మొక్కను కొత్త కుండీలో తిరిగి నాటాం కదా.. ఎక్కువ మొత్తంలో నీళ్లు పోస్తేనే అది ఎప్పటిలాగా ఎదగగలుగుతుంది అనుకుంటారు కొందరు. ఇదీ పొరపాటే అంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో నాటిన వెంటనే మొక్కకు నీళ్లు పోసి.. రెండు మూడు రోజుల పాటు అలా వదిలేయడం లేదంటే కొన్ని నీళ్లు అలా పైపైన చల్లడం వల్ల మొక్క మట్టిలో అడ్జస్ట్ అవుతుంది. అలా కాకుండా ముందే ఎక్కువ నీళ్లు పెడితే వాటి వేర్లు కుళ్లిపోయే ప్రమాదం ఉంది. అందుకే మొక్కకు అవసరమైనంత మేరకే నీళ్లు పోయాలంటున్నారు నిపుణులు. ఇలా పోసిన నీళ్లు మట్టిలో నిల్వ ఉండకుండా.. కుండీని ఎంచుకునేటప్పుడు అడుగున రంధ్రం ఉందో లేదో చూసుకోవడమూ మర్చిపోకూడదు.


## హిట్ టాక్‌లో కన్నప్ప మూవీ



టాకీస్: మంచు విష్ణు హీరోగా నటించిన కన్నప్ప సినిమా ఎట్టకేలకు నిన్న ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. కొన్నిసార్లు వాయిదా పడిన ఈ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి పాజిటివ్ టాక్ సంపాదించింది. సినిమా బాలేదని అనే వాళ్లు ఉన్నా సరే, ఎక్కువ శాతం మాత్రం సినిమా బాగుందని అంటున్నారు. అయితే ఈ సినిమా టీం మాత్రం ఒక ఆసక్తికరమైన పోస్టర్ రిలీజ్ చేయడం చర్చకు తావిస్తోంది. నిజానికి ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ప్రేక్షకులు కూడా థియేటర్లకు వెళ్లి చూడాలనుకుంటున్నారు. చాలామంది చూస్తున్నారు. అయితే ఏకంగా మొదటి రోజే ఇండస్ట్రీ హిట్ కన్నప్ప అంటూ పోస్టర్ రిలీజ్ చేయడంతో ఒక్క రోజులోనే ఇండస్ట్రీ హిట్ స్టేటస్ సాధించిన ఘనత ఈ సినిమాకే దక్కుతుంది అంటూ సోషల్ మీడియాలో కొందరు ట్రోల్ చేస్తున్నారు. ఇండస్ట్రీలో అప్పటివరకు ఉన్న హిట్ సినిమా రికార్డులను ఈ సినిమా తిరగరాసి అత్యధిక కలెక్షన్లు రాబడితే దాన్ని ఇండస్ట్రీ హిట్ అని అభివర్ణిస్తారు. కానీ మంచు విష్ణు సినిమా టీం ఏమని ఆలోచించిందో తెలియదు, కానీ ఏకంగా రెండవ రోజు ఇలా రికార్డు స్థాయిలో ఇండస్ట్రీ హిట్ పోస్టర్ రిలీజ్ చేయడం చర్చకు తావిస్తోంది.

## తమ్ముడు చిత్రానికి ఏ సర్టిఫికెట్

టాకీస్: టాలీవుడ్ నటుడు నితిన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం తమ్ముడు వకీల్ సాబ్ ఫేమ్ వేణు శ్రీరామ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. కన్నడ నటి సప్తమి గౌడ కథానాయికగా నటిస్తుంది. ఈ చిత్రాన్ని జూలై




4న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నారు మేకర్స్. ఇప్పటికే ట్రైలర్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా సెన్సార్ కంప్లీట్ చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ సినిమాకు ఏ సర్టిఫికెట్‌ను అందించింది. ఈ విషయాన్ని చిత్రయూనిట్ సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఈ సినిమాలో లయ, స్వశిక, వర్ష బొల్లమ్మ, సౌరభ్ సచ్‌దేవా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. శ్రీ వెంకటేశ్వర బ్యానర్‌పై దిల్ రాజు నిర్మించిన ఈ చిత్రానికి అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందించారు.

# 'కాటా లగా..' గుండె ఆగింది




టాకీస్: కాటా లగా.. సాంగ్ ఫేమ్. నటి షఫాలీ జరివాలా (42) గుండెపోటుతో మరణించారు. శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురి కావడంతో వెంటనే ఆమెను ఆమె భర్త పరాగ్ త్యాగి అంధేరిలోని బెల్లేవ్యూ ఆస్పత్రికి తరలించాడు. అక్కడ ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కాటా లగా రీమిక్స్ సాంగ్ తో షఫాలీ జరివాలా కుర్రకారు మదిని దోచి ఒక్కసారిగా ఫేమస్ అయిపోయింది. దీంతో ఆమెను అందరూ అదే పేరుతో కాటా లగా గర్ల్ అని పిలవడం మొదలు పెట్టారు. హిందీ బిగ్ బాస్ 13లో పాల్గొంది. సల్మాన్ ఖాన్, అక్షయ్ కుమార్, ప్రియాంక చోప్రా ప్రధాన పాత్రల్లో వచ్చిన ముజ్సే షాదీ కరోగి మూవీలో ఓ పాత్రలో కనిపించింది. పలు టీవీ రియాలిటీ షోలలోనూ మెరిసింది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఆమె సడెన్ గా మరణించడంతో అభిమానులు షాక్ కు గురయ్యారు. 2002లో ఆశా పరేఖ్ చిత్రంలోని కాంటా లగా పాటతో దేశవ్యాప్తంగా పాపులర్ అయింది.ఇది పాప్ కల్చర్‌కు సంచలనంగా మారింది. ఈ పాటకు యూట్యూబ్ లో అత్యధిక మిలియన్ వ్యూస్ రావడంతో పాటు సూపర్ హిట్ అయింది. అందుకే షెఫాలిని అభిమానులు ముద్దుగా కాంటా లగా గర్ల్ అని కూడా పిలుస్తుంటారు. ఇక షెఫాలి బిగ్ బాస్ సీజన్ 13లోనూ షెఫాలి పాల్గొంది. ముజ్సే షాదీ కరోగి సినిమా తర్వాత హిందీలో ఆమె మరో సినిమా చేయలేదు. సల్మాన్ ఖాన్, అక్షయ్ కుమార్, ప్రియాంక చోప్రాల ప్రధాన పాత్రలలో ముజ్సే షాదీ కరోగి చిత్రం రూపొందగా, ఇందులో షెఫాలీ ప్రత్యేక పాత్రలో కనిపించింది. ఇక షెఫాలి 2015లో పరాగ్ త్యాగిని వివాహం చేసుకుంది. పరాగ్ త్యాగితో పాటు నాచ్ బలియే 5, నాచ్ బలియే 7 డ్యాన్స్ రియాలిటీ షోలలో కూడా పాల్గొని సందడి చేసింది. అయితే షెఫాలి ఆకస్మిక మరణం చిత్ర పరిశ్రమను, ఆమె అభిమానులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. పాప్ సింగర్ మికా సింగ్ కూగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశాడు. ఆమె మరణంతో నేను చాలా షాక్ అయ్యాను అని అన్నారు. ఇక సినీ ఇండస్ట్రీకి చెందిన పలువురు ప్రముఖులు కూడా షెఫాలి జరివాలాకి సంతాపం తెలియజేస్తున్నారు.

## బిజీ లైఫ్‌లోనూ బంధం బలంగా..

# చైతూ, శోభిత సీక్రెట్ ఇదే..


నటి శోభితతో తన వైవాహిక జీవితంపై స్పందించిన నాగ చైతన్య

వృత్తిపరమైన జీవితంలో ఎంత బిజీగా ఉన్నా బంధం కోసం ఓ నియమం

ఇద్దరం హైదరాబాద్‌లో ఉంటే కలిసే భోజనం చేస్తామని వెల్లడి

వారాంతాలను పూర్తిగా వ్యక్తిగత సమయానికే కేటాయింపు

రతన్ టాటా, రాజమౌళి తనకు ఎంతో స్ఫూర్తి అని వ్యాఖ్య



టాకీస్: యువ సామ్రాట్ నాగ చైతన్య, నటి శోభిత ధూళిపాళ వృత్తిపరంగా ఎంత బిజీగా ఉన్నా తమ వైవాహిక బంధం బలంగా ఉండేందుకు ఒక కచ్చితమైన నియమాన్ని పాటిస్తున్నామని వెల్లడించారు. గతేడాది వివాహ బంధంతో ఈ జంట ఒక్కటైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం తమ వ్యక్తిగత జీవితాన్ని ఎంతో ఆనందంగా గడుపుతున్నామని చైతన్య తెలిపారు. తాజాగా ఓ ప్రముఖ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తన పర్సనల్ లైఫ్, వృత్తిపరమైన ఆసక్తుల గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

వివాహం తర్వాత తమ జీవితం ఎంతో సంతోషంగా సాగుతోందని నాగ చైతన్య అన్నారు. కెరీర్ పరంగా ఇద్దరూ క్షణం తీరిక లేకుండా గడుపుతున్నప్పటికీ, తమ అనుబంధాన్ని పటిష్ఠంగా ఉంచుకోవడానికి కొన్ని పద్ధతులు పాటిస్తామని చెప్పారు. "వృత్తిపరమైన పనుల వల్ల మేమిద్దరం కలిసి గడిపే సమయం తక్కువగా ఉంటుంది. అందుకే ఆ బంధాన్ని నిలబెట్టుకోవడం కోసం కొన్ని రూల్స్ పెట్టుకున్నాం. ముఖ్యంగా మేమిద్దరం హైదరాబాద్‌లోనే ఉన్నప్పుడు ఉదయం, రాత్రి భోజనం తప్పనిసరిగా కలిసే చేయాలని నిర్ణయించుకున్నాం" అని చైతన్య వివరించారు.

వారాంతాలను పూర్తిగా తమ వ్యక్తిగత సమయానికే కేటాయిస్తామని ఆయన స్పష్టం చేశారు. "ఆదివారాల్లో మాకు నచ్చినట్లు సమయం గడుపుతాం. ఇంట్లోనే మూవీ నైట్ ప్లాన్ చేసుకోవడం, బయట షికారుకు వెళ్లడం, ఇష్టమైన వంటకాలు ఆర్డర్ చేసుకోవడం లేదా కలిసే వండుకోవడం వంటివి చేస్తూ ఆ క్షణాలను ప్రత్యేకంగా మార్చుకుంటాం" అని తెలిపారు. తనకు రేసింగ్ అంటే ఇష్టమని, శోభితకు పుస్తకాలు చదవడం ఇష్టమని చెప్పారు. అయితే, ఇటీవల ఆమెకు రేస్‌ట్రాక్‌పై డ్రైవింగ్ నేర్పించానని, ఆ అనుభూతిని ఆమె ఎంతో ఆస్వాదించిందని చైతన్య సంతోషంగా పంచుకున్నారు.

ఇదే ఇంటర్వ్యూలో తన నిజ జీవిత హీరోల గురించి కూడా చైతన్య మాట్లాడారు. తన కుటుంబ సభ్యులు కాకుండా, పారిశ్రామికవేత్త రతన్ టాటా అంటే తనకు ఎంతో గౌరవమని, ఆయన్ను ఒక స్ఫూర్తి ప్రదాతగా చూస్తానని చెప్పారు. "ఎలాన్ మస్క్ జీవిత ప్రయాణం నన్ను ఆశ్చర్యపరుస్తుంది. హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ అంటే కూడా నాకు అభిమానం. ఇక మన తెలుగు చిత్ర పరిశ్రమకు వస్తే, దర్శకుడు రాజమౌళి అంటే ఎంతో ఇష్టం" అని నాగ చైతన్య తన అభిప్రాయాలను వెల్లడించారు.

# డిమాండ్ పెంచేసిన శ్రీలీల



టాకీస్: పెళ్లి సందడిసినిమాతో తెలుగు సినీ పరిశ్రమకు పరిచయమైన శ్రీలీల ఆ తర్వాత మళ్లీ వెనక్కి తిరిగి చూసుకోవలసిన అవసరం పడలేదు. ఎందుకంటే ఆమెకు వరుస సినీ అవకాశాలు అలా వచ్చి పడ్డాయి. నిజానికి ఆమెకు ఎన్ని హిట్ సినిమాలు ఉన్నాయో అన్ని ఫ్లాప్ సినిమాలు కూడా ఉన్నాయి. కానీ ఆమె డిమాండ్ మాత్రం తగ్గడం లేదు, సరికదా ఎప్పటికప్పుడు పెరుగుతోంది. ఇప్పటికే ఆమె రెమ్యూనరేషన్ చాలాసార్లు పెంచింది. తాజాగా బాలీవుడ్ ఆఫర్లు వస్తున్నందున ఆమె ఇప్పుడు మరోసారి రెమ్యూనరేషన్ పెంచినట్లు తెలుస్తోంది. తాజా సమాచారం మేరకు శ్రీలీల ఏకంగా ఏడు కోట్లు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. తెలుగు సినిమా హీరోయిన్‌కి రెమ్యూనరేషన్ అంటే చాలా పెద్ద అమౌంట్ అని చెప్పాలి.

అయితే బాలీవుడ్ నిర్మాతలు శ్రీలీలకు ఆ మొత్తం ఇవ్వడానికి ఏమాత్రం వెనకాడడం లేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆమె రెమ్యూనరేషన్ భారీగా పెంచింది. అయితే ఆమెకు 7 కోట్లు ఇవ్వడానికి తెలుగు నిర్మాతలు ప్రస్తుతానికి సిద్ధంగా లేరు. అందుతున్న సమాచారం మేరకు ఆమె ఇప్పటివరకు రెండున్నర కోట్లు ఒక్కో తెలుగు సినిమాకి తీసుకునేది. పుష్ప సినిమాలో ఐటమ్ సాంగ్ కోసం మూడు కోట్లు తీసుకుంది. ఇప్పుడు బాలీవుడ్‌లో అవకాశాలు రావడం మొదలుపెట్టాయి కదా అని, డబ్బులు డిమాండ్ చేసి ఏకంగా ఏడు కోట్లు అడుగుతున్నట్లు తెలుస్తోంది. ఒకవిధంగా అఖిల్ అక్కినేని లెనిన్ సినిమా నుంచి బయటకు వెళ్లిపోవడానికి కూడా ప్రధాన కారణం ఇదే అని అంటున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.